
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

మంగళవారం 3 జూన్ 2025



ఉష్ణోగ్రత (అంచనా)

2-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	28
తెనాలి	39	28
నరసరావుపేట	40	28
బాపట్ల	39	28
రెంటచింతల	40	28
చీరాల	39	29



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారా లోకేశ్

రెండో దశ ఇళ్ల పట్టాల పంపిణీకి సమాయత్తం

- భవన నిర్మాణ అనుమతులు సీఆర్‌డీఏ నుంచి ఎంటీఎంసీకి బదిలీ!
- పీఎం సూర్యఘర్ అమలుకు చర్యలు చేపట్టాలి
- నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష

మంగళగిరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గంలో రెండో దశ ఇళ్ల పట్టాల పంపిణీకి అవసరమైన చర్యలు త్వరితగతిన తీసుకోవాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో ఏడాది కాలంలో చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలపై ఉండవల్లిలోని నివాసంలో సోమవారం మంత్రి లోకేశ్ సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న 3 వేల మందికి తొలి విడతలో శాశ్వత ఇంటి పట్టాలు అందజేయడం జరిగిందన్నారు. రెండో విడతలో 2,500 ఇళ్ల పట్టాల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైల్వే, కాలువ, అటవీ, దేవదాయ భూముల విషయంలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. మంగళగిరి లో యూ-1, ఐ-2 జోన్లు, భవన నిర్మాణ అనుమతులు సీఆర్డీయే నుంచి ఎంటీఎంసీకి బదిలీ చేసే అంశంపైనా చర్చించారు. అలాగే, నియోజకవర్గంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న భూగర్భ డ్రెయినేజీ, స్టామ్ వాటర్ డ్రెయిన్లు, తాగునీరు, అండర్ గ్రౌండ్ గ్యాస్, పవర్ ప్రాజెక్టులపై చర్చించారు. ఆగస్టు నాటికి ఆయా ప్రాజెక్టుల డీపీఆర్‌లు పూర్తిచేసి అన్ని పనులు ఒకేసారి ప్రారంభించేందుకు చర్యలు తీసుకో వాలన్నారు. నిధుల సమీకరణపై అధికారులు ఈ సందర్భంగా మంత్రి లోకేశ్‌కు వివరించారు. మంగళగిరి పానకాల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలను గురించి సమీక్షిం చారు. స్థానికంగా పీఎం సూర్య ఘర్ పథకం అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాన్నారు. ఈ పథకం కింద 37 వేల దరఖాస్తులు వచ్చా యని అధికారులు వివరించారు. లబ్ధిదారులకు అవసరమైన రుణ సదుపాయం కోసం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించాలని మంత్రి లోకేశ్ సూచించారు. నిత్యం రద్దీగా వుండే మంగళగిరి- తెనాలి- నారాకోడూరు మధ్య రోడ్డు నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. జూలై 15 నాటికి డీపీఆర్ సిద్ధమవుతుందని, ఈ ఏడాది నవంబర్‌లో పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. చినకాకాని ఐటీ పార్కు, నిడమర్రు ప్రభుత్వ పాఠశాల మోడల్ స్కూల్‌గా అభివృద్ధి, వీవర్‌శాల, పార్కుల అభివృద్ధి, ట్రాఫిక్ క్రమ బద్ధీకరణ, పెనుమాక, మంగళగిరి, దుగ్గిరాలలో సాంఘీక సంక్షేమ హాస్టళ్ల నిర్మాణం, కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం తదితర పనులను వేగవంతంగా పూర్తిచేయాలని మంత్రి లోకేశ్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సీఆర్డీయే కమిషనర్ కన్నబాబు, గుంటూరు ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, ఏడీసీఎల్ సీఈ ప్రభాకర్, మంగళగిరి సీపీడీసీఎల్ ఏడీఈ సురేష్‌బాబు, ఆర్‌అండ్‌బీ సీఈ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ సీఈ ఎం.రాజేంద్రప్రసాద్, జేవీఆర్ రెడ్డి, భావన్నారాయణ పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్సీ కె.నాగబాబు
- 101 మందికి రూ.5.05 కోట్ల ప్రమాద బీమా చెక్కుల పంపిణీ

మంగళగిరి సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ కార్యకర్తల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కార్యకర్తల బాగు కోసమే ప్రథమంగా ఆలోచిస్తారని శాసనమండలి సభ్యుడు, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. మంగళగిరిలోని ఆర్‌ఆర్ కన్వెన్షన్‌లో సోమవారం కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ప్రమాదాల్లో మృతిచెందిన కార్యకర్తలకు సంతాపం తెలిపారు. ఈ



కార్యకర్త కుటుంబానికి నగదు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

సందర్భంగా ఎమ్మెల్సీ నాగబాబు మాట్లాడుతూ ఒక్క రోజే 101 మంది కార్యకర్తల కుటుంబాలకు రూ.5.05 కోట్ల మేర ప్రమాద బీమా చెక్కులను అందజేశామన్నారు. శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ 2020లో జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వాలు మొదలై కార్యకర్తలకు ప్రమాద బీమా చేయించిన తొలి పార్టీగా జనసేన నిలిచిందన్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.30 కోట్ల మేర ప్రమాద బీమా సొమ్మును కార్యకర్తల కుటుంబాలకు అందజేశామన్నారు. ఈ నెల 4న పార్టీ రూపొందించిన పీడ విరగడై ఏడాది సుపరిపాలన మొదలై ఏడాది కార్యక్రమం తాలూకా గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని, సంక్రాంతి, దీపావళి కలయికతో ఉదయం రంగవల్లుల పోటీలు, సాయంత్రం దీపాలు వెలిగించి బాణాసంచా కాల్చాలని కోరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, నేతలు పాల్గొన్నారు.


అప్పుడు ఇప్పుడూ సమిధలు వారే!

పల్నాడు జిల్లా ఫ్యాక్షన్

గ్రామాల్లో అటు వైసీసీ ప్రభుత్వంలో.. ఇటు కూటమి ప్రభుత్వంలో బాధితులు, సమిధలు టీడీపీ కార్యకర్తలే. అప్పుడు వైసీసీ నేతలు అధికారం చలాయిస్తే.. ఇప్పుడు అనధికారికంగా పోలీసు అధికారులను అడ్డుపెట్టుకుని వారే తమ ఆధిప త్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కేసులున్నా తప్పించు కుంటున్నారు.. టీడీపీలో కోవర్టులతో తమ వ్యతిరేక వర్గాలను తప్పిస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఏడాది అవుతున్నా.. పిన్నెల్లి సోదరుల పిడికెట్లోనే అరాచకాలు కొనసాగుతున్నాయి.

ప్రభుత్వం మారినా.. అధికారం వారిదే!

- అధికారంలో ఉన్నా.. హతులు టీడీపీ వారే
- వైసీపీ నేతల కనుసన్నల్లోనే పోలీస్ యంత్రాంగం
- చీమ చిటుక్కుమన్నా ఆ పార్టీ నేతలకు సమాచారం
- నాటి హత్యలు, అనుమానాస్పద మరణాలపై విచారణలేవీ?
- ఫ్యాక్షన్ గ్రామాల్లో నేటికీ భయం గుప్పిట్లో టీడీపీ శ్రేణులు
- ఫ్యాక్షనిస్టులను తలపించేలా అప్పట్లో పోలీసుల వ్యవహారం
- సమగ్ర విచారణ జరిపితే సగం మంది పోలీసులు ఇంటికే



గుంటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో గడిచిన పదేళ్ల టీడీపీ శ్రేణులు దిన దిన గండం.. నూరేళ్ల ఆయుష్షు అన్నట్లు కాలం గడిపారు. రాష్ట్రంలో గత టీడీపీ ప్రభుత్వంలోనూ మాచర్ల ఎమ్మెల్యేగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విజయం సాధించారు. ఆ ఐదేళ్లూ.. ఆయన అరాచకాలకు అప్పటి ప్రభుత్వం కళ్లెం వేయలేక పోయింది. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పిన్నెల్లి సోదరులు మరింతగా రెచ్చిపోయారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం భారీ ఘన విజయంతో కొలువుదీరింది. మాచర్ల ఎమ్మెల్యేగా జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎమ్మెల్యే కావడంతో టీడీపీ శ్రేణులకు మంచి రోజులు వచ్చాయని భావించారు. కానీ, నియోజకవర్గంలో పోలీస్ శాఖలో పెద్దగా మార్పు లేదు. నేటికీ వైసీపీ నాయకుల కనుసన్నల్లో పోలీస్ యంత్రాంగం పనిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎక్కడ చీమ చిటుక్కుమన్నా వైసీపీ నాయకులకు తెలిసిపోతోందని, పోలీస్ అధికారులు, సిబ్బంది కూడా వారికి అనుకూలంగానే వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. ప్రధానంగా పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావుపై టీడీపీ నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

నాటి అరాచకాలపై చర్యలేవి?

వైసీపీ 2019లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతోనే.. పల్నాడులో అరాచకాలకు తెగబడింది. ఎంతో మంది టీడీపీ కార్యకర్తలు, నాయకులు గ్రామాలు వదిలి వెళ్లిపోయారు. ఆత్మకూరు టీడీపీ శ్రేణులను గ్రామ బహిష్కరణ చేయడం సంచలనం సృష్టించింది. అప్పట్లో చంద్రబాబు ఛలో ఆత్మకూరుకు పిలుపునివ్వగా అధికార పార్టీ ఆదేశాలతో పోలీసులు ఈ కార్యక్రమానికి అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. చివరకు ఆయన ఇంటి గేటుకు తాళాలు వేసి నిర్బంధం అమలు చేశారు. చివరకు విజయవాడకు చెందిన టీడీపీ నేతలు బుద్ధా వెంకన్న, బోండా ఉమామహేశ్వరరావు, న్యాయవాది పారా కిశోర్‌లపై వైసీపీ నేత, పిన్నెల్లి ప్రధాన అనుచరుడు తురకా కిశోర్ చేసిన హత్యాయత్నం.. పల్నాడులో నెలకొన్న దారుణ పరిస్థితులను బాహ్య ప్రపంచానికి చాటిచెప్పింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిలో 12 కేసుల్లో బెయిల్ తెచ్చుకునే వరకు కూడా పిన్నెల్లి సోదరుడు వెంకట్రామిరెడ్డిని అరెస్ట్ చేయకపోవడం పల్నాడు పోలీసుల పనితీరును ప్రశ్నిస్తోంది.

హత్యకు ముందు ఓ ఎస్సై రెక్కీ

తోట చంద్రయ్య హత్య కుట్రలో ఓ ఎస్సై పాత్ర కూడా ఉన్నట్లు తెలిసింది. హత్యకు (మిగతా 8వ పేజీలో)

తోట చంద్రయ్య హత్యలో పోలీసు కుట్ర

వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామానికి చెందిన తోట చంద్రయ్యను 2022 జనవరి 13న వైసీపీ గూండాలు అత్యంత దారుణంగా గొంతు కోసి హత్య చేశారు. జై జగన్ అంటే ప్రాణాలతో వదిలేస్తామని వైసీపీ రౌడీలు చంద్ర య్య గొంతుపై కత్తి పెట్టినప్పటికీ.. జై చంద్రబాబు అనడంతో దారుణంగా హతమార్చారు. చంద్రయ్య అంత్య క్రియలకు హాజరైన నాటి ప్రతిపక్ష నేత, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆయన పాడె మోశారు. పార్టీ కార్య కర్తల్లో భరోసా నింపడానికి ప్రయత్నించారు. చంద్రయ్య హత్యకేసు విచారణను గత ప్రభుత్వంలో తూతూ మంత్రంగా చేపట్టారు. ఈ హత్య వెనుక కుట్రలు, కుతంత్రాలతో పాటు నేటికీ బహిర్గతం కాని పోలీసుల ప్రత్యక్ష పాత్ర ఉండటం కలకలం రేపుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక చంద్రయ్య హత్య కేసులో పిన్నెల్లి బ్రదర్స్ పాత్ర ఉందని గుర్తించి, వారిని కూడా నిందితుల జాబితాలో చేర్చి, కేసును సీఐడీకి బదిలీ చేశారు.



చంద్రయ్యను హత్య చేస్తున్న వైసీపీ నేతలు (పాత చిత్రం)

బీటీ.. రాష్ట్రం దాటి!

- నిషేధిత బీటీ-3 పత్తి విత్తన విక్రయాలు
- గుంటూరులో తయారీ.. తెలంగాణలో అమ్మకాలు
- మహబూబ్‌నగర్‌లో పట్టుబడుతున్న వైనం
- ఇక్కడ ప్యాకెట్ రూ.600, అక్కడ రూ. 1,500 విక్రయం
- మామూళ్ల మత్తులో వ్యవసాయశాఖ
- తనిఖీలు ఉండవు.. కేసులు లేవు



గుంటూరు

నకిలీ, నిషేధిత విత్తనాల ప్రాభవం రాష్ట్రాలను దాటిపోతోంది. మొలవని, మొలిచినా కాపునకు రాని విత్తనాలతో ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులను గుల్ల చేసిన వ్యాపారుల సామ్రాజ్యం తెలంగాణకూ విస్తరించింది. ఇక్కడ తయారు చేసిన బీటీ-3 పత్తి విత్తనాలను రాష్ట్ర సరిహద్దులోని జిల్లాలకు తరలించి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా మరిపెడ మండలం గుండెపూడిలో గుంటూరు జిల్లాకు చెందిన బీటీ-3 విత్తనాల డంపు పట్టుపడడం కలకలం రేపుతోంది.

గుంటూరు సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గుండెపూడిలో పట్టుబడిన బీటీ-3 విత్తనాలను గుంటూరు నుంచి తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నట్లు సురేష్ అనే వ్యాపారి పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. అక్కడ జరిపిన విచారణలో చాలా విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. నల్గొండ జిల్లాకు కూడా ఎక్కువ మొత్తంలో బీటీ-3 నిల్వలు గుంటూరు నుంచి వెళ్లినట్లు సమాచారం. వాస్తవానికి బీటీ-3 వినియోగంపై ప్రభుత్వ నిషేధం ఉంది. వాటి వినియోగం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటుంది.

ఆటోనగర్ నుంచి లాంచెస్టర్ వరకు..

గుంటూరు నగర పరిధిలోని ఆటోనగర్, లాంచెస్టర్ రోడ్డులో కొన్ని విత్తన కంపెనీలు, డిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీ లు ఉన్నాయి. అక్కడ కొన్ని రకాల పత్తి విత్తనాలు ప్రాసెసింగ్ పేరుతో యూనిట్లు నిర్వహిస్తున్నారు. అనుమతి లేని విత్తనాలు కూడా అక్కడ ప్రాసెసింగ్ జరుగుతోంది. ముఖ్యంగా బీటీ-3 తయారీ ఈ ప్రాంతంలోనే ఎక్కువగా జరుగుతోంది. అక్కడ ఎవరు బీటీ-3 విత్తనాలు.. ఎవరు నకిలీ విత్తనాలు తయారు చేసి విక్రయిస్తున్నారో వ్యవసాయ శాఖ దగ్గర కచ్చితమైన సమాచారం ఉంది. అక్కడ తయారు చేసిన బీటీ-3 విత్తనాలు (మిగతా 8వ పేజీలో)

నమూనాలు తీస్తే ఒట్టు

నగర పరిధిలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల తయారీ సంస్థలు, అమ్మకాలు జరిపే వారి నుంచి ప్రతి ఏడాది ఇన్ని నమూనాలు తీయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. కానీ ఏ ఒక్క విభాగం లోనూ లక్ష్యానికి అనుగుణంగా నమూనాలు సేకరించలేదు. అయినా సదరు అధికారులపై చర్యలూ తీసుకోలేదు.



రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేస్తున్న కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి పెరిన్ దేవి, అధికారులు

రైతు సాధికారత కోసం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్


కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి పెరిన్ దేవి

మంగళగిరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రైతుల సాధికారత కోసం ప్రభుత్వం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి పెరిన్ దేవి పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఖరీఫ్ సీజన్ సన్నద్ధత-వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్-2025లో భాగంగా సోమవారం మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలో ఆమె పర్యటించారు. రైతులతో మాట్లాడి వ్యవసాయంలో వారు అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులకు తట్టుకుని నిలిచే కొత్త వంగడాలు, భూసార పరీక్షలు, ప్రకృతి వ్యవసాయం, పశు పోషణ, ఈ-నామ్, మార్కెటింగ్ వంటి అంశాలపై చర్చించారు. పలువురు లబ్ధిదారులకు డ్రోన్, యంత్ర పరికరాలు, పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పెరిన్ దేవి మాట్లాడుతూ వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా రైతులు చురుకైన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఒకే దేశం-ఒకే వ్యవసాయం-ఒకే బృందం అనే నినాదంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఏపీ వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ పర్చూరు ప్రాంతంలోని హెచ్‌డీ బ్లాక్ బర్లీ పొగాకును కొనేందుకు కొనుగోలుదారులు ముందుకు రాకపోవడంతో రైతులు అమ్ముకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఎక్స్ అఫిషియో బుడితి రాజశేఖర్, కేంద్ర వ్యవసాయ శాఖ డిప్యూటీ సెక్రెటరీ అనూప్ సింగ్, ఉద్యాన శాఖ సంచాలకులు శ్రీనివాస్, అడిషనల్ డైరెక్టర్ విజయలక్ష్మీ, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

సమాజ హితమే లక్ష్యం

- లక్ష్య సాధన కోసం అకుంఠిత దీక్ష
- జేఈఈ అడ్వాన్స్ ర్యాంకర్ల మనోగతం

గుంటూరు (విద్య) జూన్ 2 (ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధన కోసం అకుంఠిత దీక్షతో కృషి చేశారు. జాతీయ స్థాయిలో లక్షల మంది పోటీ పడే పరీక్షల్లో తమ సత్తా చాటి.. అత్యున్నత ర్యాంకులు సాధించారు. సోమవారం విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌లో ర్యాంకులు సాధించి తమ కలల్ని సాకారం చేసుకునేందుకు తొలి అడుగు వేయనున్నారు. సాంకేతిక విద్యలో అగ్రగామి ఐఐటీల్లో చేరనున్నారు. జేఈఈ అడ్వాన్స్ ర్యాంకర్లను "ఆంధ్రజ్యోతి" పలకరించింది.



ఎస్.వెంకట సాయి చక్రి

సైబర్ నేరాలకు అడ్డుకట్ట

సైబర్ సెక్యూరిటీలో నైపుణ్యం సాధించి నేరాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యమని జేఈఈ అడ్వాన్స్‌లో 33 ర్యాంకు సాధించిన ఎస్.వెంకట సాయి చక్రి వెల్లడించారు. ముంబై ఐఐటీలో సీఎస్‌సీ పూర్తి చేస్తానని తెలిపారు. అనంతరం సైబర్ సెక్యూరిటీ పై పరిశోధన చేయనున్నట్లు వివరించారు. ర్యాంకు సాధన కోసం తల్లిదండ్రులు సుజాతా శ్రీరామూర్తి, అధ్యాపకులు ఇచ్చిన మార్గదర్శకాలు ఎంతో ఉపకరించాయని తెలిపారు.

ఒత్తిడిని అధిగమిస్తే మెరుగైన ఫలితాలు



ఎం.శ్రీకరగణేష్

జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని 104వ ర్యాంకు సాధించిన ఎం శ్రీకర్ గణేష్ తెలిపారు. తాను బెంగళూరులోని ఐఐఎస్‌లో బీటెక్ పూర్తి చేసి పరిశోధనల వైపు వెళ్లడమే (మిగతా 8వ పేజీలో)

బావిలో పడి బీటెక్ విద్యార్థి మృతి


పమిడి పవన్ కుమార్(ఫైల్)

నూజెండ్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలోని తంగిరాల గ్రామంలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పమిడి ఏడుకొండలు కుమారుడు పమిడి పవన్ కుమార్(21) గుంటూరులో బీటెక్ చదువుతూ సెలవులకు ఇంటికి వచ్చాడు. ఉదయం గ్రామం పక్కనే ఉన్న జామాయిల్ తోటకు కాపలాగా వెళ్లి.. పొలంలో ఉన్న బావిలో ప్రమాద వశాత్తు పడ్డాడు. ప్రమాదాన్ని గమనించిన నాయనమ్మ సుబ్బులు కేకలు వేయడంతో గ్రామస్తులు వెళ్లి రక్షించేందుకు ప్రయత్నించినా ఆచూకీ లభించలేదు. దీంతో ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్‌లతో 25 అడుగుల లోతు ఉన్న నీటిని తోడించి, మృత దేహాన్ని బయటకు తీశారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ బీవీ కృష్ణారావు పరిశీలించి, మృత దేహాన్ని వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కుమారుడి అకాల మృతితో తల్లిదండ్రులు, ఏడుకొండలు, నాగరాజ రోదిస్తున్నారు.

శుద్దపల్లిలో దారుణహత్య


కొమ్మూరి గోపయ్య (ఫైల్)

పొన్నూరుటౌన్(చేబ్రోలు), జూన్ 2(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం శుద్దపల్లి గ్రామంలో తాపీ మేస్త్రీ కొమ్మూరి గోపయ్య(35) హత్య సంచలనంగా మారింది. చేబ్రోలు పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం శుద్దపల్లి గ్రామానికి చెందిన కొమ్మూరి గోపయ్య అలియాస్ గోపీ తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. సోమవారం శుద్దపల్లి గ్రామంలోనే గుర్తుతెలియని వ్యక్తులు మారణాయుధాలతో విచక్షణ రహితంగా గోపయ్య పై దాడి చేయడంతో అతను అక్కడే మృతి చెందాడు. రక్తపు మడుగులో గోపయ్యను గుర్తించిన స్థానికులు చేబ్రోలు పోలీసులకు సమాచారం అందించారు. పొన్నూరు రూరల్ సీఐ కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ వెంకట కృష్ణ ఘటన స్థలానికి చేరుకుని మృతుడి తల్లి కొమ్మూరి రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

వివాహేతర సంబంధంపై అనుమానం..

గోపయ్య భార్యతో విభేదాల కారణంగా చేబ్రోలులో నివసిస్తున్నాడు. చేబ్రోలుకు చెందిన మరో తాపీ మేస్త్రీతో గోపయ్య కర్నూల్‌లో టాపీ పనులకు వెళ్లారు. తిరిగొస్తూ ఒక మహిళను కూడా చేబ్రోలు తీసుకువచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. చేబ్రోలు తాపీ మేస్త్రీ సదరు మహిళతో సహజీనవం చేస్తుండగా వారం రోజుల క్రితం కనిపించకుండా పోయింది. గోపయ్య ఆ మహిళను తీసుకువెళ్లి దాచాడని అనుమానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య వివాదం చెలరేగింది. గోపయ్య హత్యపై పలు కోణాలలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శివాజీ మృతికి పోలీసులకు సంబంధం లేదు

అవాస్తవాలను ప్రజలు నమ్మొద్దు! డీఎస్పీ జనార్దనరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జనార్దనరావు

తెనాలిరూరల్, జూన్2(ఆంధ్రజ్యోతి): తెనాలిలో బంగారు బట్టి నిర్వాహకుడు సిద్ధేష్ శివాజీ ఆత్మహత్యకు పోలీసుల వేధింపులే కారణమంటూ కొన్ని పత్రికలు, సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని డీఎస్పీ జనార్దనరావు చెప్పారు. సోమవారం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సిద్ధేష్ శివాజీ ఆత్మహత్యకు పోలీసుల వేధింపులే కారణమంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. గత నెల 22న తెనాలి రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంఎం జ్యూయలర్స్ అధినేత రమేష్ అనే వ్యక్తి వచ్చి తన దగ్గర స్టాక్ మేనేజర్‌గా పనిచేసే అనిల్‌కుమార్ జైన్.. మోసగించి సుమారు కేజీ బంగారం దొంగిలించాడని ఫిర్యాదు చేశారుని చెప్పారు. దార్యాప్తులో భాగంగా అనిల్‌కుమార్ జైన్ తన వద్ద కొంత బంగారం ఉందని ఒప్పుకున్నాడని తెలిపారు. ఆ బంగారాన్ని రికవరీ చేయడం జరిగిందన్నారు. మిగిలిన బంగారం గురించి అడగగా తనకు మరి కొంత మందికి అమ్మినట్లు చెప్పాడని పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా తెనాలి త్రీ టౌన్ ఎస్ఐ ప్రకాష్‌రావుని అధికారిగా బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. గత నెల 31న సాయంత్రం నిందితుడు చెప్పినదాని ప్రకారం సిద్ధేష్ శివాజిని బంగారం బట్టి వ్యాపారానికి సంబంధించిన వాళ్ల అసోసియేషన్ పెద్దలతో కలిసి పిలిపించడం జరిగింది. వారి సమక్షంలో విచారించగా అనిల్ కుమార్ జైన్ అతనికి 100 గ్రాములు బంగారం అమ్మినట్లుగా చెప్పాడన్నారు. అసోసియేషన్ పెద్దలు, బంధువులు కొంత సమయం కావాలని కోరడంతో.. ఎస్ఐ అంగీకరించి అతడిని పంపించినట్లు తెలిపారు. ఆ మరుసటి రోజు ఉదయం వారి ఇంట్లో సిద్ధేష్ శివాజి ఉరి వేసుకొని చనిపోయాడని, విషయాన్ని పోలీసులకు తెలపకుండా తల్లిదండ్రులు, బంధువులు కలిసి వారి స్వగ్రామమైన మహారాష్ట్రకి మృతదేహాన్ని తీసుకువెళ్లిపోయినట్లు తెలిసిందన్నారు. ఈ విషయంపై కొన్ని వార్తపత్రికల్లో, సోషల్ మీడియాల్లో తెనాలి పట్టణ సీఐలు వారిని మానసికంగా శారీరకంగా వేధించారని అసత్య కథనాలు రాశారని, ఇందులో పోలీసుల ప్రమేయం ఏ మాత్రం లేదని డీఎస్పీ స్పష్టం చేశారు. పోలీస్ ప్రతిష్టను దెబ్బతీసేలా కొన్ని న్యూస్ పేపర్లు అర్థాన్ని వక్రీకరించి సూసైడ్ నోట్లో పోలీస్‌ల తప్పు ఉన్నట్లుగా రాయడం సమంజసం కాదన్నారు. వన్‌టౌన్ సీఐ మల్లిఖార్జున రావు, రూరల్ ఎస్ఐ ఆనంద్, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వివిధ వర్గాలను రెచ్చగొట్టడానికే జగన్ పర్యటన

● ఆలపాటి, ప్రత్తిపాటి ధ్వజం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్2 (ఆంధ్రజ్యోతి): జగన్ తెనాలి పర్యటనకు వచ్చేముందు కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాలని, ఆయన తన పార్టీ కార్యకర్తల పరామర్శకు వస్తున్నాడా లేక నేరస్తులతో ములాఖత్ అవ్వడానికి వస్తున్నాడో చెప్పాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సోమవారం డిమాండ్ చేశారు. స్థానిక ప్రత్తిపాటి క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి ఆయన మాట్లాడారు. కల్తీమద్యం, గంజాయి, డ్రగ్స్ అమ్మేవారికి మద్ధతిస్తున్న జగన్ వైఖరి చూస్తుంటే, మరలా ఆయన తన పాత నేర స్వభావాన్ని బయటపెట్టే ప్రయత్నం చేస్తున్నాడేమో అన్న సందేహం ప్రజలకు కలుగుతోందన్నారు. జగన్ పరామర్శించబోతున్న జాన్ విక్టర్ 2017 నుంచి వివిధ నేరాల్లో ముద్దాయిగా ఉండి, పదుల కొద్దీ కేసులు నమోదైన మాట వాస్తవం కాదా అని ఆలపాటి ప్రశ్నించారు. దోమా రమేశ్ అనే మరో నిందితుడు కిడ్నాప్, హత్యాయత్నం, దొంగతనం కేసుల్లో ముద్దాయని, కరిముల్లా అనే వ్యక్తి పోలీస్‌స్టేషన్ పై దాడిచేసిన కేసులో ముద్దాయని తెలిపారు.

ప్రజల దృష్టి మళ్లించడానికే డ్రామాలు..

కూటమి ప్రభుత్వం వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, కుంభకోణాలను వెలికితీస్తోందన్న భయంతో ప్రజల దృష్టి వాటిపై నుంచి మళ్లించడానికే జగన్ వెన్నుపోటు దినం పేరుతో డ్రామాలు ప్రారంభించాడని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత జగన్ ఇస్తున్న పిలుపులకు ప్రజా స్పందన శూన్యమన్నారు. జగన్ దోపిడీకి, అరాచకపాలన చేసిన వైసీపీనేతలతో పాటు వారికి సహకరించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా జైలుకువెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు. విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్ ర్యాంకర్లకు భాష్యం చేయూత

● ఉన్నత చదువులకు రూ. 16 లక్షల పంపిణీ


33వ ర్యాంకర్‌కు నగదు చెక్కు అందజేస్తున్న భాష్యం రామకృష్ణ తదితరులు

గుంటూరు(విద్య), జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు భాష్యం విద్యా సంస్థలు చేయూత అందించాయి. జాతీయ స్థాయిలో 152వ ర్యాంకర్ జి.సాయిమనోజ్ఞకు రూ.5 లక్షలు, 33వ ర్యాంకర్ ఎస్.వెంకటసాయి చక్రికి రూ.5లక్షలు, 104వ ర్యాంకర్ శ్రీకర గణేష్, 108 ర్యాంకర్ ఎన్. ఆకాష్ తదితరులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, 146, 151 ర్యాంకర్లు టి. విక్రమ్ లెవీ, డి. జస్వంత్ బాలాజీకి రూ. లక్ష చొప్పున అందజేశారు. విద్యార్థుల ఉన్నత చదువు కోసం ఈ మొత్తాలను భాష్యం ఐఐటి జేఈఈ అకాడమి అందిస్తున్నట్లు భాష్యం రామకృష్ణ వెల్లడించారు.

ర్యాంకర్లతో సంబరాలు

జేఈఈ అడ్వాన్స్ ర్యాంకులు సాధించిన విద్యార్థుల ఆధ్వర్యంలో భాష్యం మెయిన్ క్యాంపస్‌లో సంబరాలు నిర్వహించారు. భారీ కేక్ కట్‌చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో గుంటూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. వైస్ చైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ పాల్గొన్నారు.

జడ్పీలో ముగిసిన బదిలీలు


జడ్పీలో జరిగిన ఉద్యోగుల కౌన్సిలింగ్ ప్రక్రియలో పాల్గొన్న చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సీఈఓ జ్యోతి బసు, డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ

గుంటూరు సిటీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలోని ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. సాధారణ బదిలీల్లో భాగంగా సోమవారం గుంటూరు జడ్పీ సమావేశ మందిరంలో ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా పాల్గొన్నారు. బదిలీల ప్రక్రియ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు. జడ్పీ సీఈవో జ్యోతిబసు మాట్లాడుతూ ఒక ఊరిలో ఐదేళ్ల విధులు నిర్వహిస్తే తప్పనిసరిగా బదిలీ ఉంటుందన్నారు. ఎక్కడైనా ఖాళీలు ఉంటే ఆ ప్రాంతానికి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటామన్నారు. జడ్పీ పరిధిలో 91 మందికి స్థానచలనం కలిగింది. వీరిలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ 7, సీనియర్ అసిస్టెంట్లు 8, జూనియర్ అసిస్టెంట్లు 17, టైపిస్టులు 9, రికార్డ్ అసిస్టెంట్లు 8, ల్యాబ్ అసిస్టెంట్లు 2, ఆఫీస్ సబార్డినేట్లు 39, నైట్ వాచ్‌మన్ ఒకరు బదిలీ అయ్యారు. డిప్యూటీ సీఈవో కృష్ణ, అకౌంట్ ఆఫీసర్ సామ్యూల్ పాల్, ఏవో రాజరత్నం బాబు పాల్గొన్నారు.

చదువుకోవాలని ఉంది.. ఇప్పుడే పెళ్లి వద్దు!

ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాలిక

గుంటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): 'ప్లీజ్... నాకు చదువుకోవాలని ఉంది. ఇప్పుడే పెళ్లి చేసుకోను.' అంటూ ఓ మైనర్ బాలిక సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించింది. బాలిక కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చేబ్రోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వడ్లమూడి గ్రామానికి చెందిన దంపతులకు కుమార్తె జన్మించిన తొమ్మిదేళ్లకు కుమారుడు జన్మించాడు. అప్పటి వరకు కుమార్తెను ప్రేమగా చూసు కున్న తల్లిదండ్రులు కుమారుడు జన్మించినప్పటి నుంచి కూతురు పట్ల వివక్ష చూపడం ప్రారంభించారు. పదో తరగతి పరీక్షలు రాసిన తర్వాత పాలిసెట్ కూడా రాయమని తల్లిదండ్రులు కోరగా తనకు ఇష్టం లేదని బాలిక చెప్పింది. అయినప్పటికీ తల్లిదండ్రులు బలవంతంగా ఆమెతో పాలిసెట్ రాయించారు. అందులో సరైన ర్యాంకు రాక పోవడంతో అప్పటి నుంచి వారు కుమార్తెపై ద్వేషం పెంచుకోవడమే కాకుండా.. ఇంటి నుంచి బయటకు గెంటి వేశారు. దీంతో బాలిక గుంటూరులోని అరండల్ పేటలో ఉన్న తన బాబాయి ఇంటికి వచ్చింది. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బాలికకు 520 మార్కులు వచ్చాయి. కానీ, మార్కులు తక్కువ వచ్చాయని, పైచదువులు చదవాల్సిన అవసరం లేదని, ఇంటిలో పనులు నేర్చుకుంటే పెళ్లి చేస్తామని తల్లిదండ్రులు అంటున్నారని బాధిత బాలిక వాపోయింది. పది రోజుల క్రితం సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు వంటివి ఇవ్వాలని ఫోన్ చేసి అడిగితే వాటిని ఇచ్చేది లేదని తల్లిదండ్రులు చెప్పారని పేర్కొంది. స్కూల్ మేనేజ్‌మెంట్‌కు ఫోన్ చేసి పదవ తరగతి సర్టిఫికెట్లు తనకు ఇవ్వొద్దని చెప్పారని తెలిపింది. తనకు చదువుకోవాలని ఉందని, అందుకు తల్లిదండ్రులు ఆటంకం కల్పించకుండా న్యాయం చేయాలని బాలిక ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులను వేడుకుంది. ప్రస్తుతం బాలిక అరండల్‌పేటలో ఉంటున్న నేపథ్యంలో అరండల్ పేట పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసు అధికారులు సూచించారు.

79 మంది ఉద్యోగాలకు ఎంపిక

నరసరావుపేట రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ప్రముఖ కాగ్నిజెంట్ టెక్నాలజీ సర్వీసెస్ సంస్థ సోమవారం కళాశాల ఆవరణలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. కళాశాలకు చెందిన 79 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ మిట్టపల్లి రమేష్, కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి అభినందించారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎన్ఈసీ చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు

మెగా డీఎస్సీకి కట్టుదిట్టమైన ఏర్పాట్లు

డీఈఓ సీవీ రేణుక

గుంటూరు (విద్య) జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో మెగా డీఎస్సీ నిర్వహణకు విస్తృత ఏర్పా ట్లు చేస్తున్నట్లు డీఈఓ సీవీ రేణుక వెల్లడించారు. మొత్తం 14 పరీక్ష కేంద్రాలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇందులో గుంటూరు జిల్లాకు సంబంధించి ఎన్నారై ఇంజనీరింగ్ కాలేజ్, కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, కిట్స్ అక్షర ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఆర్‌వీఆర్ అండ్ జేసీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, కళ్లం హరినాథ్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్, సెయింట్ మేరీస్ ఇంజనీరింగ్ కాలేజ్, సెయింట్ మేరీస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ గుంటూరు, కేఎల్ యూనివర్సిటీ, విజ్ఞాన్ లారా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, మిట్టపల్లి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ తదితర కేంద్రాలు ఉన్నట్లు చెప్పారు. బాపట్ల జిల్లాలో బాపట్ల ఇంజనీరింగ్ కాలేజ్, సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అం డ్ టెక్నాలజీలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లాకు సంబంధించి తిరుమల, నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలు తదితర కేంద్రాలు ఏర్పాటు చేశారు. మెగా డీఎస్సీ పరీక్ష విడతల వారీగా దాదాపు నెల రోజులపాటు కొనసాగుతుంది. పరీక్ష కోసం ఉమ్మడి జిల్లాలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, పండిట్స్ విభాగాల్లో టీచర్ పోస్టుల కోసం 43,611 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని డీఈఓ రేణుక తెలిపారు.

ప్రజలను వైసీపీ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచింది

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి



నరసరావుపేట టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ప్రజలను వెన్నుపోటు పొడిచి ఘోరంగా ఓడిపోయిందని, ఆ సంగతిని మరచి ఈ నెల 4న ప్రజా ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ వెన్నుపోటు దినంగా నిరసన తెలుపుతామని చెప్పడం సిగ్గుచేటని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశంలో కొమ్మాలపాటి మాట్లాడుతూ పేదల పింఛను పెంచడానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఐదేళ్ల పట్టిందని, రాష్ట్రాన్ని ఆర్థిక, అభివృద్ధిని విధ్వంసకర దుస్థితిలోకి చేర్చిన ఘనత వైసీపీదేనన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు గాడిలో పెడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ నిధులు విడుదల చేయడంలో ఆలస్యమవడంతోనే అన్నదాత సుఖీభవ పథకం జాప్యమైందని తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభానికి ఒక రోజు ముందే తల్లికి వందనం కింద రూ.15 వేలు తల్లులకు అందజేస్తామన్నారు. టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda 117 బ్యాంక్ ఆఫ్ బరోడా
సత్తెనపల్లి బ్రాంచ్
డి నెం.9-2-42, గ్రౌండ్ ఫ్లోర్, పాత బస్టాండ్ దగ్గర, వడ్డవల్లి, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522403.

ఋణగ్రహీతలు/హామీదారులకు డిమాండ్ నోటీసు
(సర్ఫేసి చట్టం, 2002 లోని సెక్షన్ 13 యొక్క సబ్- సెక్షన్ (2) క్రింద)

ఋణగ్రహీతలు: 1) M/s ప్రవహ చిల్లీ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న డైరెక్టర్లు, శ్రీవిన్ కోల్డ్ స్టోరేజ్ సర్వే నెం.54-బి, 55-1, రెడ్డిగూడెం, రాజుపాలెం మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522412. 2) M/s. ప్రవాహ చిల్లీ ప్రైవేట్ లిమిటెడ్, CIN U15122AP2016PTC103983, ఉద్యం రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ AP-04-0004740 ఫ్లాట్ నెం.టీక్-116, రెయిన్ ట్రీ పార్క్, నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా, నంబూరు పోస్ట్, గుంటూరు-522508. ఆంధ్రప్రదేశ్. 3) శ్రీమతి చింతపల్లి ప్రణుతి, డైరెక్టర్ ఆఫ్ M/s. ప్రవాహ చిల్లీ ప్రైవేట్ లిమిటెడ్, డోర్ నెం.4-139, శ్రీవిన్ గ్రీన్స్, 13/16 కి॥మీ॥ మైలురాయి, రెడ్డిగూడెం, రాజుపాలెం మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522412. 4) శ్రీమతి తేళ్ల నళిని, డైరెక్టర్ ఆఫ్ M/s ప్రవాహ చిల్లీ ప్రైవేట్ లిమిటెడ్, డోర్ నెం.44, LILAC, L&T సెరీన్ కౌంటీ, ఉర్దూ విశ్వవిద్యాలయం దగ్గర, టెలికాం నగర్, గచ్చిబౌలి, హైదరాబాద్, తెలంగాణ-500032.

హామీదారులు : 1) శ్రీ చింతపల్లి ప్రదీప్ చక్రవర్తి, డోర్ నెం.44, LILAC, L&T సెరీన్ కౌంటీ, ఉర్దూ యూనివర్సిటీ దగ్గర, టెలికాం నగర్, గచ్చిబౌలి, హైదరాబాద్, తెలంగాణ-500032. 2) శ్రీమతి చింతపల్లి జయశ్రీ, డోర్ నెం.4-139, శ్రీవిన్ గ్రీన్స్, 13/16 కి॥మీ॥ మైలురాయి, రెడ్డిగూడెం, రాజుపాలెం మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522412. 3) శ్రీమతి చింతపల్లి ప్రణుతి, డోర్ నెం.4-139, శ్రీవిన్ గ్రీన్స్, 13/16 కి.మీ మైలురాయి, రెడ్డిగూడెం, రాజుపాలెం మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522412. 4) శ్రీ విపిన్ ధౌండియాల్, డోర్ నెం. 4-139, శ్రీవిన్ గ్రీన్స్, 13/16 కి॥మీ॥ మైలురాయి, రెడ్డిగూడెం, రాజుపాలెం మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522412. 5) శ్రీ చింతపల్లి ప్రవీణ్ చక్రవర్తి, డోర్ నెం.26-1-72, చక్రవర్తి నిలయం, నగరంపాలెం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్. 6) శ్రీమతి తేళ్ల నళిని, డోర్ నెం.44, LILAC, L&T సెరీన్ కౌంటీ, ఉర్దూ యూనివర్సిటీ దగ్గర, టెలికాం నగర్, గచ్చిబౌలి, హైదరాబాద్, తెలంగాణ-500032.

విషయము: మా బ్యాంక్ ఆఫ్ బరోడా, మా సత్తెనపల్లి బ్రాంచ్ నుండి పొందిన ఋణసౌకర్యాలు గురించి

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం దిగువ సంతకందారు రిజిస్టర్ పోస్ట్ ద్వారా **తేది.22.05.2025** న మీకు తిరుగు రశీదులతో కూడిన డిమాండ్ నోటీసు మీచే పొందుపరచబడిన చిరునామాకు జారీచేయడమైనది. మేము మీకు పంపిన రిజిష్టర్ నోటీసు యొక్క ఎక్నాలెడ్జ్‌మెంట్, పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా అందజేయబడలేదు కావున, మేము ఈ పత్రికా ప్రకటన ద్వారా సదరు నోటీసు ప్రచురించబడినది. సదరు నోటీసు యొక్క వివరము దిగువ తెలుపబడినది. మీ యొక్క లోన్ ఖాతా బకాయిలు సరిగా చెల్లించనందున సదరు అకౌంట్ **తేది.30.06.2024** నుండి నిరర్థక ఆస్తిగా (ఎన్.పి.ఎ) పరిగణించబడినది. ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా మీరు బకాయి మొత్తము **తేది.10.05.2025 నాటికి రూ.7,31,47,795.15 పై (అక్షరాల ఏడు కోట్ల ముప్పై ఒక్క లక్షల నలభై ఏడు వేల ఏడు వందల తొంభై ఐదు రూపాయల పదిహేను పైసలు మాత్రమే) + తేది.11.05.2025** నుండి వర్తించని వడ్డీతో పాటు చట్టపరమైన మరియు ఇతర ఛార్జీలతో మొదలగునవి మీరు చెల్లింపు చేయు తేది వరకు పేర్కొన్న విధంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి చెల్లించవలెను. పైన చెప్పిన సదరు చట్టంలోని సెక్షన్ 13(13) నియమానుసారం సెక్యూరిటీగా ఉంచిన ఆస్తులకు సంబంధించి బ్యాంక్ ఆఫ్ బరోడా వారి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి అమ్మకము, లీజు లేదా ఇతరత్రా లావాదేవీలు (సాధారణ వ్యాపార అవసరాలు తప్ప) ద్వారా బదిలీ చేయుట నిషేధించబడతాయని మీరు గమనించవలెను. ఈ నోటీసు సదరు చట్టంలోని సెక్షన్ 13(2) నిబంధనల ప్రకారం జారీచేయబడినది.

స్థిరాస్తుల వివరములు

ఆస్తి నెం.1 : గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, పిడుగురాళ్ల సబ్ డిస్ట్రిక్ట్, రాజుపాలెం గ్రామపంచాయతీ లిమిట్స్, రాజుపాలెం, డి నెం.54/బి - ఎకరా 2.50 సెంట్లు, డి నెం:55/1 - ఎకరా 3.08 సెంట్లు, మొత్తం ఎకరా 5.58 సెంట్లులోని ఇందులో ఎకరా 5.05 సెంట్లులోని ఫ్యాక్టరీ భూమి మరియు భవనం 21.03.2006 తేదీ (డాక్యుమెంట్ నెం:1215/2006) తేదీ 12.10.2009 తేదీ (డాక్యుమెంట్ నెం:6861/2009) తేదీ 12.10.2009 తేదీ (డాక్యుమెంట్ నెం:6861/2009) ద్వారా ఆస్తి యజమానులు ఎకరా 1.50 సెంట్ల భూమిని విక్రయించినారు, అది ఇక్కడ మినహాయించబడింది మరియు ఎకరా 5.05 - ఎకరా 1.50 = ఎకరా 3.55 సెంట్లు వ్యవసాయేతర భూమి. హద్దులు : తూర్పు : పసుపెద కోటయ్య ఇతరులు యొక్క భూమి, దక్షిణం : రోడ్డు, గుంటూరు, హైదరాబాద్ హైవే, పడమర : రాయపరపూర్ బ్రహ్మయ్య ఇతరులు యొక్క భూమి, ఉత్తరం : రైల్వే భూమి.

పై హద్దుల యందు విస్తీర్ణం 3.55 ఎకరాలులోని స్థలం.

ఆస్తి నెం.2 : మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కూకట్‌పల్లి గ్రామం మరియు మండలం, కెపిహెచ్‌బి కాలనీ వద్ద సర్వే నెం.1009/1 (భాగం) నందు అవిభాజ్యమైన వాటాతో ఉన్న విస్తీర్ణం 50.0 చ॥గ॥లు భూమితో అందులోని "రెయిన్ ట్రీ పార్క్" బ్లాక్ విస్టా నికోబార్ 1, అయిదవ అంతస్తులోని విస్తీర్ణం 1225 చ॥అ॥లుతో (కామన్ ఏరియాలు & బాల్కనీలతో కలిపి), మున్సిపల్ నెం. 15-31-RTP-1-NI1-D/05/07 తో రెసిడెన్షియల్ ఫ్లాట్ యూనిట్ నెం. NI1-D/05/07 మరియు ఒక కార్ పార్కింగ్ స్లేస్ నెం. St-12 తో కలదు. హద్దులు : ఉత్తరం : కారిడార్/యూనిట్ నెం. NI1-D/05/03, దక్షిణం : ఓపెన్ టు స్కై, తూర్పు : మెట్లు/యూనిట్ నెం. NI1-D/05/08, పడమర : యూనిట్ నెం. NI1-D/05/06.

ఆస్తి నెం.3 : గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, పిడుగురాళ్ల సబ్ జిల్లా, రాజుపాలెం మండలం, రెడ్డిగూడెం గ్రామ డి నెం.23-1A1 నందు విస్తీర్ణం ఎకరా 12.64 లోని ఎకరా 1.06 సెంట్లులోని విస్తీర్ణం ఎకరా 0.50 సెంట్లు రిజిష్టర్ గిఫ్ట్ డీడ్ తేది.18.11.2010 (డాక్యుమెంట్ నెం.10376/2010) వ్యవసాయేతర భూమి మరియు ఆర్‌సిసి భవనం కలదు. హద్దులు : తూర్పు : శ్రీవిన్ ఫుడ్ ప్రోడక్ట్స్ యొక్క స్థలం, దక్షిణం : రోడ్డు, గుంటూరు, హైదరాబాద్ హైవే, పడమర : శివరాత్రి కోటయ్య గారి స్థలం, ఉత్తరం : చింతపల్లి ప్రభాకర రావు గారి స్థలం.

ఆస్తి నెం.4 : షెడ్యూల్ ఎ : గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం యొక్క సబ్ రిజిస్ట్రార్ యొక్క పరిధి, నంబూరు గ్రామ పంచాయితీ, నంబూరు గ్రామం వద్ద ఆర్ ఎస్ నెం.214/1లోని ఎకరా 7-30 సెంట్లు, ఆర్ ఎస్ నెం.217లోని ఎకరా 2-68 సెంట్లు, ఆర్ ఎస్ నెం.216/2 లోని ఎకరా 9-34 సెంట్లు, ఆర్.ఎస్ నెం.213/1ఎ లోని ఎకరా 0-77 సెంట్లు మరియు ఆర్ ఎస్ నెం.213/బి1 లోని ఎకరా 1-02 సెంట్లు, మొత్తం విస్తీర్ణం ఎకరా 21-11 సెంట్లు లేదా 102172.4 చ॥గ॥లులోని రెసిడెన్షియల్ స్థలం ఒకే ముక్కగా ఏర్పడిన రెసిడెన్షియల్ ఫ్లాట్. హద్దులు : ఉత్తరం : ఆస్తి కొంతవరకు మొదటి భాగం యొక్క పార్టీ నంబర్ 2 కి చెందినది, దక్షిణం : ఆస్తి కొంతవరకు మొదటి భాగంలోని పార్టీ నెం.2 కి చెందినది, కొంతవరకు జాతీయ రహదారికి చెందినది మరియు శ్రీ విశ్వరూప శ్రీనివాస క్షేత్ర ట్రస్ట్ కు చెందిన స్థలం, తూర్పు : శ్రీ విశ్వరూప శ్రీనివాస క్షేత్ర ట్రస్ట్‌కి చెందిన ఇతరుల భూమి,, పడమర : కొంతవరకు కంతేరు రోడ్డు, కొంతవరకు ఇతరుల భూమి, కొంతవరకు మొదటి భాగం లోని పార్టీ నెం.2 కి చెందిన ఆస్తి.

షెడ్యూల్ బి : గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం యొక్క సబ్ రిజిస్ట్రార్ యొక్క పరిధి, నంబూరు గ్రామ పంచాయితీ, నంబూరు గ్రామం వద్ద ఆర్ ఎస్ నెం.213/1 మరియు ఆర్ ఎస్ నెం.213/బి1, 214/1, 217 మరియు 216/2 నందు ఎకరా 21.11 సెంట్లులోని అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని వాటాతో ఉన్న విస్తీర్ణం 116-00 చ॥గ॥లు భూమి నందు టీక్ బ్లాక్, మొదటి అంతస్తులోని బిల్టప్ ఏరియా 1744 చ॥అ॥లుతో అపార్ట్‌మెంట్ యూనిట్ నెం.0116 మరియు పార్కింగ్ ఏరియా 134 చ॥అ॥లుతో పార్కింగ్ స్పేస్ నెం.MPTW STILT REGULAR No.1342 తో కలదు. హద్దులు : ఉత్తరం : యూనిట్ నెం.0115 తరువాత ఓపెన్ టు స్కై, దక్షిణం : యూనిట్ నెం.0117 తరువాత ఓపెన్ టు స్కై, తూర్పు : కారిడార్, పడమర : ఓపెన టు స్కై.

షెడ్యూల్ ఎ భూమి నందు విస్తీర్ణం 116.00 చ॥గ॥లులోని అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని ఉమ్మడి వాటాతో ఉన్న భూమితో పాటు షెడ్యూల్ బి లోని షెడ్యూల్ ఎ భూమితో చెప్పబడిన టీక్ బ్లాక్ 1వ అంతస్తులోని బిల్టప్ ఏరియా 1774 చ॥అ॥లుతో రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ యూనిట్ నెం.0116 తో కలదు.

ఆస్తి నెం.5 : గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, గుంటూరు గ్రామం యొక్క డి నెం.457 వద్ద లే-అవుట్ ఆమోదిత ప్లాన్ వైడ్ నెం.35/55 ప్రకారం విభజించబడిన ఫ్లాట్ కొంత ఆస్తి నందు ఫ్లాట్ నెం.100 నందు విస్తీర్ణం 133 1/3 చ॥గ॥లు స్థలం నందు భూమి & భవనం కలదు. హద్దులు : తూర్పు: ఫ్లాట్ నెం.99 లోని ఆస్తి - 40'-00", దక్షిణం : 20 అ॥ల రోడ్డు - 30'-00", పడమర: ఫ్లాట్ నెం.101 లోని ఆస్తి - 40'-00", ఉత్తరం: ఫ్లాట్ నెం.89 లోని ఆస్తి - 30'-00".

పై హద్దుల యందు విస్తీర్ణం 133 1/3 చ॥గ॥లు లోని స్థలం.

770.86 లక్షల విలువైన స్టాక్ మరియు రూ. 230.46 లక్షల విలువైన బుక్ అప్పులు మరియు రూ. 181.74 లక్షల విలువైన ప్లాంట్ మరియు యంత్రాల హైపోథికేషన్ (ABS 31.03.2024 ప్రకారం).

తేది : 22.05.2025
స్థలం : సత్తెనపల్లి

సం/- అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా

బహిరంగ ప్రకటన

ICICI Bank నమోదిత కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్, చక్లి సర్కిల్ సమీపాన, పాత పద్రా రోడ్, వదోదర - 390 007
కార్పొరేట్ కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400 051.

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

ICICI బ్యాంక్ లిమిటెడ్ ("ICICI బ్యాంక్") నుండి వారిచే [illegible] దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు నోటీసులు జారీ చే[illegible] చేయబడిన బంగారు ఆభరణములకు మేము ఇ-వేలము [illegible] బ్యాంక్ కలిగియున్నది. ఇ-వేలము ఆన్‌లైన్ ద్వారా మ.12.[illegible] దిగువ ఇచ్చిన వెబ్‌సైటు లాగిన్ అవ్వండి. ఒకవేళ ఋణగ్[illegible]

ఋణ ఖాతా నం.	ఖాతాదారు పేరు	ఋణ ఖాతా నం.	ఖాతాదారు పేరు	ఋణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: గుంటూరు		[illegible]		[illegible]	
630762031887	సగిలి కిషోర్ రెడ్డి	363162002481	[illegible]	375857000000	[illegible]
శాఖ పేరు: మదనపల్లి		070462003557	[illegible]	307262002626	[illegible]
067362036708	షేక్ ముబాషర్ అహ్మద్	307262002542	[illegible]	070162017075	[illegible]
067362036737	షేక్ ముబాషర్ అహ్మద్	028062008586	[illegible]	070162017082	[illegible]
067362036739	షేక్ ముబాషర్ అహ్మద్	454462003176	[illegible]	789462000140	[illegible]
067362036746	షేక్ ముబాషర్ అహ్మద్	758405002690	[illegible]	067462014211	[illegible]
067362036963	షేక్ ముబాషర్ అహ్మద్	456462000231	[illegible]	111457000063	[illegible]
శాఖ పేరు: కడప		460457000259	[illegible]	255662002680	[illegible]
067462014306	ప్రదీప్ బి	307262002260	[illegible]	412762004566	[illegible]
శాఖ పేరు: నెల్లూరు		664957015049	[illegible]		
631062022695	భాను శంకర్ కరు				
శాఖ పేరు: హిమ్మంగి					
307262002772	[illegible]				
శాఖ పేరు: ఆదిపత్తి					
130562007810	ప్రతాప్ రెడ్డి గంగి రెడ్డి గారి				

తేది : 03.06.2025
ప్రదేశం: అనంతపురం, అన్నమయ్య, కాకినాడ, [illegible] తిరుపతి, చిత్తూరు, విశాఖపట్నం, పశ్చిమ గో[illegible] కరీంనగర్

సం/- అధీకృత అధికారి, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



జీపీఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియలో పాల్గొన్న మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు

ప్రజల అర్జీలను శాశ్వతంగా పరిష్కరించాలి

● మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరం లో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగర పాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. పీజీఆర్ఎస్‌లో మేయర్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 23 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని మేయర్, కమిషనర్ అధికారుల తో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కరించాలని, ఆయా అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామన్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 41 ఫిర్యాదు లు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 17, ఇంజనీరింగ్ విభాగం 11, రెవెన్యూ విభాగం 4, ప్రజారోగ్య విభాగం 7, ఉపా సెల్ విభాగం 1, అకౌంట్స్ విభాగానికి సంబంధించి ఒక ఫిర్యాదు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీపీ రాంబాబు, సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను సహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలి

● ముస్లిం పెద్దలు సహకరించాలి ● నగర మేయర్, కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో బక్రీద్ పండుగ సహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలని, నగరపాలక సంస్థకు ముస్లిం పెద్దలు సహకరించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. సోమవారం నగరపాలక సంస్థలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఈనెల 7న జరగబోయే బక్రీద్ పండుగ నిర్వహణపై ముస్లిం, హిందూ మత పెద్దలు, గో సంరక్షణ సమితి సభ్యులు, పశు సంవర్ధక శాఖ, నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికా రులతో ప్రత్యేక సమావేశం జరిగింది. మేయర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి మత విశ్వాసాలను గౌరవిస్తూ, బక్రీద్ పండుగను శాంతియుత వాతావర ణంలో నిర్వహించుకుందామన్నారు. నగరంలో ఎక్కడైనా గోవధ జరిగితే జీఎంసీ కాల్ సెంటర్‌కు లేదా ప్రత్యేక బృందాలకు తెలియ చేయాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఏర్పాటు చేసే తాత్కాలిక జంతువధ శాలను వినియోగించుకోవాలన్నారు. గోవధ నిరోధక చట్టం 1977, పశు సంరక్షణ చట్టం సెక్షన్ 05 ప్రకారం రాష్ట్రంలో ఆవు, దూడలను, చూడి పశువులను, 3 నెలల్లోపు దూడలు కలిగిన పశువులను ఎట్టి పరిస్థితుల్లోను వధించరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డీఏహెచ్‌వో కేవీ సత్యనారాయణ, డీడీఎం రత్నజ్యోతి, ఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు, గోసంరక్షణ సమితి సభ్యులు, హిందూ, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

మెగా యోగాని జయప్రదం చేయాలి

గుంటూరు కార్పొరేషన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యో గా దినోత్సవం (జూన్ 21) సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర 2025లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ని స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం ఎదురు రోడ్ (యోగా రోడ్) లో జూన్ 4వ తేదీ ఉదయం ప్రజలు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, స్టేక్ హోల్డర్స్‌తో కలిసి జిల్లాస్థాయి మెగా యోగా కార్యక్రమం చేపట్టనున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాదు

దళితులకు క్షమాపణలు చెప్పిన తరువాతే.. తెనాలికి రావాలి

● జగన్ పర్యటనపై మాజీ మంత్రి డొక్కా వ్యాఖ్యలు

గుంటూరు(తూర్పు), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నాటి వైసీపీ పాలన లో సర్వం కోల్పోయిన దళిత కుటుంబాలకు జగన్ మోహన్‌రెడ్డి క్షమా పణలు చెప్పిన తర్వాతే తెనాలి పర్యటనకు రావాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత కుటుంబాల పరామర్శించే నైతిక బాధ్యతను జగన్ ఎప్పుడో కోల్పోయారని విమర్శించారు. నాటి వైసీపీ పాలనలో దళితులపై జరిగిన దాడుల విషయంలో జగన్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. దళిత డ్రైవర్‌ను డోర్ డెలివరి చేసిన అనంతబాబును, శిరోముండనం చేసిన తోట త్రిమూర్తులను పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదని నిలదీశారు. డాక్టర్ సుధాకర్‌ను చంపిన వారిని కనీసం శిక్షించలేకపోయారన్నారు. ఇప్పుడు దళిత కుటుంబాలకు పరామర్శించడానికి రావడం దేనికి సంకేతమని అన్నారు. తెనాలిలో పోలీసుల చర్యను సమర్థించమని... అదే సమయంలో జగన్ రావడాన్ని కూడా సమర్థించమని స్పష్టం చేశారు. గంజాయి, మత్తు పదార్థాలను అమ్మేవారిని పరామర్శిస్తే తమకు అభ్యంతరం లేదని... కాకపోతే దళిత కుటుంబాల పరామర్శకు వస్తే మాత్రం అంతకుముందు జరిగిన దాడులపై క్షమాపణలు చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. వెన్నుపోటు దినం చేసే హక్కు వైసీపీకి లేదని గతంలో ఆ పార్టీ ఇచ్చిన చాలా హామీలను నెరవేర్చలేదని గుర్తు చేశారు.

అరాచకాలపై సమాధానం చెప్పి జగన్ తెనాలికి రావాలి

● ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షుడు సుభాని

గుంటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, ముస్లింలపై జరిగిన అరాచకాలపై సమాధానం చెప్పి జగన్ తెనాలి పర్యటనకు రావాలని ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సుభాని డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019-24లోని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనార్టీలపై జరిగిన దాడుల గురించి అప్పుడు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌రెడ్డి తీసుకున్న చర్యల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఏ పర్యటనకు వెళ్లిన అలీబాబా 40 దొంగలు లాగా వైసీపీలో ఉన్న దొంగలను పక్కన పెట్టుకొని వెళుతున్నారని సుభాని ఎద్దేవా చేశారు.

గుంటూరు మీదగా ఏసీ స్పెషల్ ట్రైన్

గుంటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీని తగ్గించేందుకు ప్రతి గురువారం నంబరు.07041 సికింద్రా బాద్-కాకినాడ టౌన్ ప్రత్యేక ఏసీ ఎక్స్‌ప్రెస్ రైలుని గుంటూరు మీదగా నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు జూన్ 12వ తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు ప్రతి గురువారం రాత్రి 10.40కి బయలుదేరి అర్ధరాత్రి దాటా క 2.38కి సత్తెనపల్లి, 3.55కి గుంటూరు, మరుసటి రోజు ఉదయం 10.45కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నంబరు. 07042 కాకినాడ టౌన్-సికింద్రాబాద్ ప్రత్యేక ఏసీ ఎక్స్‌ప్రెస్ జూన్ 13వ తేదీ నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు ప్రతీ శుక్రవారం సాయంత్రం 6.55కి బయలుదేరి రాత్రి 11.50 గుంటూరు, అర్ధరాత్రి దాటాక 12.48కి సత్తెనపల్లి, మరుసటి రోజు ఉదయం 7 గంటలకు సికింద్రాబాద్ చేరుకొంటుంది.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

● ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్‌తేజ

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 206 అర్జీలు

● పరిష్కరించాలంటూ ఆదేశాలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్‌తేజ, స్టెప్ సీఈవో చంద్రముని తదితరులు

గుంటూరు(తూర్పు), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ బార్గవతేజ ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 206 అర్జీలు వచ్చాయి. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం గంగరాజు, లక్ష్మీకుమారి, ఆర్డీవో శ్రీనివాసరావు, స్టెప్ సీఈవో చంద్రమునితో కలసి ఆయన అర్జీలను స్వీకరించారు. అనంతరం ఏ భార్గవతేజ పీజీఆర్ఎస్ వచ్చే ఆర్జీలపై ముఖ్యమంత్రి దృష్టి సారించారని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అర్జీదారుని సమస్యను పరిష్కరించిన విధానాన్ని క్షుణ్ణంగా తెలిపి, అధికారి పనితీరు మీద ఫీడ్ బ్యాక్ అందించాలన్నారు. అర్జీదారుని దరఖాస్తుని రిజిస్టర్‌లో తప్పక నమోదు చేయాలన్నారు. బాలకార్మికులను గుర్తించి వారిని స్కూళ్లలో చేర్పించాలన్నారు. 14 సంవత్సరాల లోపు పిల్లలు బడి బయట ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 4న జరిగే జీఎంసీ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహించే మెగా యోగాలో జిల్లా అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా, డీఆర్డీఏ, హౌసింగ్ పీడీలు శంకర్, విజయలక్ష్మి, ప్రసాదు, డీపీవో నాగసాయికుమార్, సీపీవో శేషశ్రీ, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన ఉత్తర్వులను, మార్గదర్శకాలను ఆయా కలెక్టర్ కార్యాలయాలకు పంపాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ కోరారు. ఈ మేరకు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో చావలి బాలస్వామి, జోసఫ్, భగవాన్‌దాస్, జాన్‌బాబు తదితరులు ఉన్నారు.

● బక్రీద్ పురస్కరించుకొని జరిగే గో హింసను అరికట్టాలని బజరంగ్ దళ్, వీహెచ్‌పీ, హిందూ చైతన్య వేదిక ప్రతినిధులు అర్జీ అందజేశారు. అధికారులు నిర్వహిస్తున్న పీస్ సమావేశాలు తూతూ మంత్రంగా జరుగుతున్నా యని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశానికి ఆయా మత పెద్దలతో పాటు కబేళాలును నిర్వహించే వారిని ఆహ్వానించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అనిల్ బెహరా, వనమా నరేంద్ర, వంగా నవీన్‌రెడ్డి, న్యాయవాది హరిహరరాయల్ తదితరు లున్నారు.

● స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లో ఉన్న వసతి గృహాన్ని తనిఖీ చేయాలని విభిన్న ప్రతిభావంతుల ఆదరణ సేవా సంస్థ అధ్యక్షుడు శివప్రసాదు కోరారు. అక్కడ ఉండే అంధులు శారీరక వైకల్యం ఉన్నవారిని రాకుండా అడ్డుకుంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వసతి గృహాన్ని అందరూ విని యోగించుకోవాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పిన ప్పటికి అంధులు పట్టించుకోవడం లేదన్నారు. విభిన్న ప్రతిభ వంతుల కార్యా లయంలో కంప్యూటర్ అపరేటర్ ఉద్యోగాన్ని శారీరక వైకల్యం లేని వారికి కేటాయించారని దీనిపై విచారణ జరిపించాలన్నారు.



ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవతేజ

ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ


గుంటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం రూ పొందించిన పోస్టర్‌ని ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవతేజ ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్ లోని శంకరన్ హాల్లో ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారిద్దాం, క్లాత్ బ్యాగులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ గురువారం పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, స్టెప్ సీఈవో చంద్రముని, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ ఎండి.నజీమా బేగమ్, గుంటూరు ఆర్‌డీవో కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇద్దరికి కారుణ్య నియామక ఉత్తర్వుల అందజేత

ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల్లో ఒకరి చొప్పున ఇద్దరికి కారుణ్య నియామక ఉత్తర్వులను ఇన్‌ఛార్జ్ కలెక్టర్ అందజేశారు. వీరిలో తాడిశెట్టి ఎస్ఎన్‌కే కుమార్‌కు పోలీస్ శాఖలో, బుళ్ల శృతికి రెవెన్యూ శాఖలో జూనియర్ ఆఫీసు అసిస్టెంట్లుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ నిబద్ధత, అంకితభావంతో ప్రభుత్వ సర్వీసును క్రమశిక్షణతో నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

గుంటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిగ్రీ చదువుతున్న ఆరుగురు మూగ, చెవిటి విద్యార్థులకు ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ భార్గవతేజ ల్యాప్‌టాప్‌లు పం పిణీ చేశారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రి, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులు చదివే దివ్యాంగులు ఏపీడీఏఎస్‌సీఏసీ. ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి అర్హత మేరకు ఏ.పీ.డీఫరెన్షియల్ అండ్ సీనియర్ సిటిజన్ అసిస్టెన్స్ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా ల్యాప్ టాప్‌లు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ సువార్త, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు గంగరాజు, లక్ష్మీకుమారి, ఆర్‌డీవో కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ఎన్నికల హామీలను నెరవేర్చాలి : సీపీఐ

గుంటూరు(తూర్పు), జూన్ 2(ఆంధ్రజ్యోతి): పేదలకు పట్టణాల్లో రెండు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మం జూరు చేయాలనే ఎన్నికల హామీని నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో తూర్పు, తహసీల్దార్ కార్యాలయం ఎదుట అర్జీదారులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి ఇస్తామన్న రూ.4 లక్షల వాగ్దానాన్ని కూడా అమలు చేసే దిశగా ప్రభుత్వం లేదని విమ ర్శించారు. ఉచిత బస్సు, ఆటో కార్మికులకు ఇస్తామన్న రూ.15 వేలు, నిరు ద్యోగ భృతి ఏమైందో తెలియడం లేదన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో జరిగే ఆందోళనల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చా రు. అనంతరం తహసీల్దార్ మాబు సుభానికి అర్జీదారులు నాయకులతో కలిసి అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యా ద్రి, వెంకటేశ్వరరావు, అరుణ్‌కుమార్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీ జీఎస్‌టీ సూపరింటెండెంట్ మృతికి సంతాపం



వినోద్‌కుమార్ (ఫైల్)

గుంటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కస్టమ్స్, జీఎస్టీ సూపరింటెండెంట్‌గా గుంటూరు డివిజన్ కార్యాలయంలో పని చేస్తున్న పి.వినోద్ కుమార్ అనారోగ్యంతో మృతి చెందారు. బుచ్చయ్యతోటలో నివాసంలో వినోద్ కుమార్ భౌతిక కాయాన్ని సోమవారం సెంట్రల్ జిఎస్‌టి కమిషనర్ సుజిత్ మల్లిక్ సందర్శించి, పూలమాలతో నివాళులర్పించారు. వినోద్ కుమార్ కుటుంబ సభ్యులను కమిషనర్ పరామర్శించి, ధైర్యం చెప్పారు. శాఖాపరంగా అండగా ఉంటామన్నారు. కాగా అడిషనల్ కమిషనర్ బి లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమిషనర్లు ఎం నాగరాజు, బి రవికుమార్, సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, అర్‌పిపి కుమార్, టివిజి కె మూర్తి, మిక్కిలినేని శ్రీనివాస్ పెన్షనర్ల సంఘ నేతలు టి.వివేకానంద, పి.వి.సత్యనారాయణ, పి.కోటేశ్వరరావు, గుమ్మడి సీతారామయ్యచౌదరి, ఎన్ఎస్ నగేష్ బాబు, సామ్రాజ్యం, మేరీ మనోరంజని తదితరులు వినోద్‌కుమార్ భౌతిక కాయానికి నివాళులర్పించారు.

జగన్ పర్యటనకు అనుమతి కోరని వైసీపీ

● ఉద్దేశపూర్వకంగా వివాదం సృష్టించాలని వ్యూహం

● రౌడీషీటర్ పరామర్శకు వస్తుండటంపై సర్వత్ర విమర్శలు

● వైసీపీ ప్రభుత్వంలోనే విక్టర్‌పై రౌడీషీట్

గుంటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెనాలిలోని ఐతా నగర్‌కు చెందిన రౌడీషీటర్ చేబ్రోలు జాన్ విక్టర్‌ను పరామర్శించేందుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మంగళవారం తెనాలి రానున్నట్లు వైసీపీ ప్రకటించింది. అయితే ఆయన పర్యటనకు వైసీపీ నాయకులు ఇంతవరకు అనుమతి కోసం పోలీసులకు దరఖాస్తు చేసుకోలేదు. దరఖాస్తు చేసుకోకుండానే పోలీసులు అనుమతి ఇవ్వలేదంటూ ప్రచారం మొదలుపెట్టారు. పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో కోర్టుకు వెళ్తున్నట్లు కూడా తప్పుడు ప్రకటన చేశారు. వీటన్నింటి నేపథ్యంలో పోలీసులు జగన్ పర్యటనను అడ్డుకునేలా వారికి వారే పథకం రూపొందించినట్లు స్పష్టమవుతోంది. అయితే పోలీసులు మాత్రం జగన్ పర్యటన విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. జగన్ పర్యటనకు సంబంధించి పోలీసు అధికారులకు సోమవారం రాత్రికి కూడా ఎటువంటి ఆదేశాలు అందలేదు.

రౌడీ షీటర్‌కు పరామర్శపై విమర్శలు..

మాజీ ముఖ్యమంత్రి ఓ రౌడీషీటర్‌ను పరామర్శించేందుకు వస్తుండడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇటీవల తెనాలిలోని ఐతానగర్ సెంటర్లో బహిరంగంగా పోలీసులు రౌడీషీటర్లకు లాఠీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఓ కానిస్టేబుల్ పై హత్యాయత్నం చేయడమే కాకుండా అంతకు ముందు ఆ ప్రాంతంలో సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచే స్తుండడంతో ప్రజల్లో భరోసా కల్పించేందుకు పోలీసులు ఈ విధంగా వ్యవ హరించినట్లు తెలుస్తోంది. ఐతానగర్ కేంద్రంగా గడిచిన ఐదేళ్లగా రౌడీషీట ర్ల ఆగడాలు శృతిమించాయి. దీంతో ఎంతోమంది అక్కడి నుంచి వెళ్లిపోయా రు. సొంతిళ్లు ఉన్నవారు బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతూ వచ్చారు. ప్రజాప్రతినిధి అండదండలతో అక్కడ రౌడీ గ్యాంగులు రెచ్చిపోయాయి.

నమ్మించి సహజీవనం చేసి మోసం

● డీజీపీ కార్యాలయంలో అటెండర్‌పై బాధితురాలి ఫిర్యాదు

గుంటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నన్ను పెళ్లి చేసుకుంటానని నమ్మించి నాతో సహజీవనం చేసి ఇప్పు డు నువ్వు ఎవరో నాకు తెలి యదు అన్నట్లుగా మాట్లాడుతున్నాడని బాధిత యువతి సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరంలోని పాతగుంటూరుకు చెందిన బాధిత యువతికి పదేళ్ల క్రితం వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య మన స్పర్ధలు రావడంతో వారు విడిపోయారు. ఇదిలా ఉంటే బాధితురాలు విజయవాడలో ఓ సంస్థలో టెలీకాలర్‌గా పని చేస్తుంటుంది. సత్తెనపల్లికి చెందిన ఆ యువకుడు మంగళగిరి పరిధిలోని డీజీపీ కార్యాలయం నాలుగో అంతస్తులో అటెండర్‌గా పనిచేస్తుంటాడు. ఆయనకు అప్పటికే వివాహం జరిగింది. వారి మధ్య మనస్పర్థలు రావడంతో ఇద్దరు వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో బాధిత యువతితో అతనికి పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వారు సహజీవనం చేస్తున్నారు. అయితే ఇటీవల ఆ యువకుడి కాపురం చక్కబడటంతో ఆ యువతిని దూరం పెట్టాడు. ఈ క్రమంలో అతనితో మాట్లాడేందుకు డీజీపీ కార్యాలయం వద్ద వెళితే ఇక్కడికి వస్తే ఆత్మహత్య చేసుకుని చచ్చిపోతానంటూ బెదిరిస్తున్నాడని అన్నారు.

సంబరాలు నిర్వహించాలి : బోనబోయిన

గుంటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కావస్తున్న సందర్భంగా, జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు జూన్ 4వ తేదీన గుంటూరు నగరంలో అన్ని డివిజన్లలో జనసేన పార్టీ నాయకు లు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్ కోరారు. సోమవారం అమరావతిరోడ్‌లోని జనసేనపార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లా డారు. జగనాసురుడి రాక్షస పాలనతో విసిగి వేసారి పోయిన ఆంధ్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కూటమి ప్రభుత్వం గత ఏడాది జూన్ నాలుగో తేదీన ఘన విజ యం సాధించినట్లు బోనబోయిన వివరించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చక్కటి పాలన చేస్తూ సంక్షేమం, అభివృద్ధితో ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జన సేన కార్యకర్తలు బుధవారం నగరంలో ఘనంగా వేడుకలు నిర్వహించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్

ఎస్టీ వర్గీకరణతోనే యానాదులకు న్యాయం : పెంచలయ్య

గుంటూరు(తూర్పు), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ వర్గీకరణతోనే యానా దుల సంక్షేమం, అభ్యున్నతి సాధ్యమవుతుందని యానాదుల సంక్షేమ సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య అన్నారు. ఎస్టీ వర్గీకరణ చేపట్టి యా నాదులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర సన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజన తెగల్లో జనాభా పరంగా మొదటిస్థానంలో ఉన్న యానాదులు నేటికి అన్ని విధాలా వెనుకబ డి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ మాదిరిగానే ఎస్టీ వర్గీ కరణ చేసి యానాదులకు ఉద్యోగ, రిజర్వేషన్ పరంగా న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో చేవూరు సుబ్బారావు, బాపట్ల బ్రహ్మయ్య, రావూరి రాజు, మురళీ, మేకల శ్రీనివాసరావు, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

అపరిష్కృత సమస్యలపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో అనేక ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అపరిష్కృత సమస్యలపై వెంటనే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధి కారులను గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆదేశించారు. మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం ఆయన ఇంజనీరింగ్ ఈఈ, డీఈ ఈ, ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఎన్నో ఏళ్లుగా కొన్ని పనులు ముందుకు కదలడం లేదని, వాటిపై ప్రత్యేకమైన దృష్టి సారించాలని సూచించారు. నగరంలో ఐలాండ్ సుందరీకరణ చేపట్టి, గ్రీనరీ పెంచాలని, అది నగరానికే అందం తెచ్చేలా ఉండాలని అన్నారు. పార్కుల్లో పిల్లలకు అవసరమైన ఆట వస్తువులు, చుట్టూ ప్రహరీ, గ్రీనరీపై దృష్టి సారించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న యూపీహెచ్‌సీ ఏర్పాటుకు స్థల సేకరణ చేపట్టాలన్నారు. సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. శంకర్‌విలాస్ ఆర్వోబీ నిర్మాణం ప్రారంభమైన నేపథ్యం లో సమగ్ర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నసీర్

సంఘ విద్రోహ శక్తులకు అధ్యక్షుడు జగన్‌రెడ్డి

● మన్నవ మోహన కృష్ణ



మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సంఘ విద్రోహ శక్తులకు అధ్యక్షుడు జగన్‌రెడ్డి అని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. ఆ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రౌడీషీటర్లు, గంజాయి మాఫియా, హత్య కేసు నిందితులకు మద్దతుగా, ఒక పోలీస్ కానిస్టేబుల్‌పై హత్యాయత్నం చేసిన క్రిమినల్స్‌ను పరామర్శించడానికి మంగళవారం తెనాలి వెళ్తున్న జగన్ ప్రతిపక్ష పార్టీకి అధ్యక్షుడివా.. సంఘ విద్రోహులకు అధ్యక్షుడివా అని అడిగితే ఎస్.. నేను సంఘ విద్రోహులకే బాస్‌ని అని తనకు తానుగా ప్రకటించినట్లుగా ఉందని మన్నవ ఆగ్రహం వ్యక్తం చేశారు. గంజాయి గ్యాంగ్, బ్లేడ్ బ్యాచ్, ఆడబిడ్డలను వేధించే వారికే జగన్ వత్తాసు పలకడం చూస్తుంటే ఆయనలో ఎంతటి సైకో దాగి ఉన్నాడో అర్థం చేసుకోవచ్చునన్నారు. తెనాలిలో కానిస్టేబుల్ చిరంజీవిపై దాడి చేసిన గంజాయి గ్యాంగ్‌కు బుద్ధి చెప్పిన వైనాన్ని రాష్ట్ర ప్రజలంతా స్వాగతిస్తుంటే సైకో జగన్ మాత్రం గంజాయి బ్యాచ్‌ను సమర్థిస్తూ పరామర్శకు బయలుదేరడం నీచమైన చర్య అని అన్నారు.

మలేరియా నివారణపై ప్రజా చైతన్య కార్యక్రమాలు

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి వెల్లడి

గుంటూరు మెడికల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా జూన్ ఒకటి నుంచి 30వ తేదీ వరకు మలేరియా నివారణ మాసోత్సవంగా పాటిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి తెలిపారు. సోమవారం బృందావన్ గార్డెన్స్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జరిగిన మలేరియా అవగాహన ర్యాలీని జెండా ఊపి ఆమె ప్రారంభించారు. దోమలు నివారించాలని ఆరోగ్య సిబ్బంది ర్యాలీలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మలేరియా నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామని ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లతో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. దోమకాటు నుంచి రక్షణ చర్యలు పాటిస్తే మలేరియా నివారణ సాధ్యమేనని డీఎంహెచ్‌వో విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయనం, డాక్టర్ వైష్ణవి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లు, ఆరోగ్య విస్తరణాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

వృద్ధాశ్రమానికి ఇన్వర్టర్ అందజేత



వృద్ధాశ్రమానికి ఇన్వర్టర్ అందజేస్తున్న ఏఐబీఈఏ జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు

గుంటూరు(తూర్పు), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా పని చేసిన తారకేశ్వర్ చక్రవర్తి శత జయంతి సందర్భంగా జిల్లా సమన్వయ కమిటీ సేవా కార్యక్రమాలను నిర్వహించింది. సోమవారం గుంటూరు శ్రీనగర్‌లోని మాతృశ్రీ వృద్ధాశ్రమానికి ఇన్వర్టర్‌ని అందజేసింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుత వేసవికాలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లిన సందర్భాల్లో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో తాము ఇన్వర్టర్ అందజేశామన్నారు.



మూతపడిన వసంతవిహార్ హోటల్

వసంత విహార్‌కి.. ఇక సెలవు!

లీజు ముగియడంతో హోటల్ మూత

డెబ్బై ఏళ్ల ప్రస్థానంలో పల్నాడు వాసులకు అనుబంధం

ఒకటా.. రెండా..ఏడు దశాబ్దాల పాటు ఒక హోటల్‌ను నడపడమంటే మాటలు కాదు. ఒక చరిత్ర. పట్టణంలోని స్టేషన్ రోడ్డులో ఉన్న వసంత విహార్ హోటల్‌తో పల్నాడు వాసులకు విడదీయరాని అను బంధం. పాతతరం వాళ్లకి ఒక అరుదైన జ్ఞాపకం. ఇప్పటికి ఒక ల్యాండ్ మార్క్‌గా ఉ న్న వసంత విహార్ హోటల్ భవన లీజు ముగియడంతో మూతపడింది.

నరసరావుపేట కల్చరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వసంత విహార్ పేరుకే హోటల్‌గాని అది రాజకీయ నాయకులకు, సంగీత, సాహిత్య, కళాకారులకు అదో వేదిక. కాఫీ, టీ తాగుతూ గంటల తరబడి చర్చోపచర్చలు అక్కడ నడిచేవి. 1950 దశకంలో కేరళ నుంచి బతుకుదెరువు కోసం వలస వచ్చిన లక్ష్మమ్మ.. రైలు దిగి వచ్చే ప్రయాణికుల కోసం చిన్న హోటల్‌ను తెరిచింది. దిన దిన ప్రవర్ధమానమై డెబ్బై ఏళ్లపాటు అప్రతిహతంగా నడిచింది. ఆమె తర్వాత మరో మూడు తరాలు ఈ హోటల్‌ను నిర్వహించాయి. ఇప్పుడు చంద్ర, రాజా నడిపిస్తున్నారు. చదువుకోవడానికి రాయలసీమ నుంచి వచ్చిన విద్యార్థులు ఇక్కడే భోజనం చేసేవారు. వాళ్లలో చల్లా రామకృష్ణారెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి వంటి వారూ ఉన్నారు. మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి ఈ హోటల్‌కు ప్రతి నిత్యం వచ్చేవారు. ఇంకా ఎందరో పట్టణానికి చెందిన ప్రముఖులకు ఈ హోటల్ కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. నిర్వాహకులు హోటల్‌ను కేవలం వ్యాపార ధృక్పథంతోనే కాకుండా..వచ్చిన వారిని పేరు పేరునా పలకరిస్తూ పట్టణ వాసుల అభిమానాన్ని చూరగొన్నారు. కళాకారులు, కవులు ప్రతిరోజూ వసంత విహార్‌కు రాకుండా రోజు గడవదు అంటే హోటల్‌తో ఉన్న అనుబంధం అర్థం చేసుకోవచ్చు. అలాంటి వసంత విహార్ హోటల్ మూతపడుతుందంటే పట్టణ వాసులు భావోద్వేగానికి లోనవుతున్నారు. హోటల్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటున్నారు.

హోటల్‌తో విడదీయరాని అనుబంధం



నేను కాలేజీ రోజుల నుంచి వసంత విహార్‌కు వస్తున్నాను. నిర్వాహకులు చంద్ర, రాజాలను నా తమ్ముళ్లలాగే చూసే వాడిని. ఎన్ని పనులు ఉన్నా రోజులో కాసేపైనా ఇక్కడికి రాకపోతే తోచదు. ఈ హోటల్‌కు వచ్చే వాళ్లలో చాలామంది ప్రముఖ స్థానాల్లో, విదేశాలలో ఉన్నారు. వాళ్లెప్పుడైనా ఊరికి వస్తే హోటల్‌ను సందర్శించి వెళ్లాల్సిందే.

-మేళం శ్రీకృష్ణ, అడ్వకేట్

ఏదో బంధం తెగిపోతున్న బాధ

-పొన్నపాటి ఈశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నేత



వసంత విహార్ మూసివేస్తున్నారంటే ఏదో బంధం తెగిపోతున్న బాధ కలుగుతోంది. ఈ హోటల్‌తో నాకు, మా లింగంగుంట్ల ప్రజలకు ఒక విడదీయరాని అనుబంధం. ప్రతి రోజు ఇక్కడికి రావాల్సిందే. రాజకీయాలు, సాహిత్యం గురించి గంటల తరబడి చర్చించాల్సిందే. రేపటి నుంచి ఎక్కడ కూర్చోవాలో అని ఆలోచిస్తేనే దిగులుగా ఉంది.

రెండ్రోజులు నిద్ర పట్టలేదు : గుబ్బా సురేష్, వ్యాపారి



చిన్నప్పటి నుంచి ఈ హోటల్‌కు రావడం అలవాటైంది. మా నాన్న గుబ్బా బాల నర్సయ్య ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేసారు. చిన్నప్పుడు నాన్నతో వచ్చి పార్శిల్ తీసుకువెళ్లేవాడిని. అప్పటి నుండి ఇప్పటి వరకు క్రమం తప్పకుండా హోటల్‌కు వస్తుంటాను. ఇక్కడికి రాకుండా రోజు గడవదు. హోటల్ మూసివేస్తున్నారని చెప్పగానే రెండ్రోజులు నిద్ర పట్టలేదు.



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో నిరుపయోగంగా ఉన్న ఆక్సిజన్ ప్లాంట్

ప్రమాదానికి ముందే.. ప్రతిస్పందించాలి

సత్తెనపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మరోసారి కరోనా కేసులు నమోదవుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతాన్ని దృష్టిలో ఉంచుకొని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గతంలో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఎందిరికో ఊపిరి పోసిన ఆక్సిజన్ ప్లాంట్లు నిరుపయోగంగా మారడంతో వాటిని బాగు చేయాల్సి ఉంది. గతంలో కొవిడ్ సమయంలో ఏరియా వైద్యశాలలో ప్రత్యేకంగా పడకలు ఏర్పాటు చేసి, చికిత్స అందించారు. కాని ప్రాణ వాయువు అందక చాలా మంది మృతి చెందారు. దూర ప్రాంతాల నుంచి ఆక్సిజన్ సిలిండర్లు తెచ్చుకొని కొంతమంది తమ ప్రాణాలు కాపాడు కున్నారు. ఎక్కడా ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో లేక చాలా మంది ఇబ్బందులు పడ్డారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో కొవిడ్ సమయంలో ఐటీసీ ఆధ్వర్యంలో 300 ఎల్ఎంటీ ఆక్సిజన్ ప్లాంట్ ఒకటి, మెగా ఇంజనీరింగ్ కంపెనీ ఆధ్వర్యంలో 500 పీఎస్ఏ ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. 2024 వరకు పని చేసిన ఈ ప్లాంట్లు మరమ్మతుల కారణంగా వృథాగా పడి ఉన్నాయి. ఒక ప్లాంట్‌కు విద్యుత్ సరఫరా లేక నిరుపయోగంగా మారగా.. మరో ప్లాంట్ కంప్రెషన్ మరమ్మతులకు గురైంది. దీంతో ఏడాదిన్నరకు పైగా ఆక్సిజన్ ప్లాంట్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో మళ్లీ సిలిండర్ల ద్వారా రోగులకు అవసరమైన ఆక్సిజన్ సరఫరా చేస్తూ ఆస్పత్రి సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం సమస్య లేక పోయినా కొవిడ్ నేపథ్యంలో వాటి అవసరాన్ని గుర్తించాల్సి ఉంది. ఈ విషయంపై ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ మరమ్మతులు కారణంగా ఆక్సిజన్ సిలిండర్లు నిరుపయోగంగా మారిన మాట వాస్తవమేనని తెలిపారు. వీటి మరమ్మతులకు ప్రతి పాదనలు పంపి, ఉన్నతాధి కారులకు నివేదించామన్నారు. వైద్యశాలలో రోగులకు 60 డీ టైప్ సిలిండర్ల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. మరో 50 వరకు ఆక్సిజన్ యంత్రాలు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం ఆక్సిజన్‌కు ఎటువంటి ఇబ్బంది లేదని చెప్పారు.

అప్పుడు.. ఇప్పుడూ.. సమిధలు వారే!

(5వ పేజీ తరువాయి)

ముందు రోజు రాత్రి పిన్నెల్లి సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి గుండ్లపాడు వచ్చి వైసీపీ నేత, ఆ కేసులో ప్రధాన నిందితుడు చింతా శివరామయ్యను అయన ఇంటిలోనే కలసి వెళ్లాడు. అప్పుడే చంద్రయ్య హత్యకు ముహూర్తం పెట్టినట్లు పోలీస్ శాఖ నిర్ధారణకు వచ్చింది. చంద్రయ్య హత్య జరగడానికి అరగంట ముందు ఓ ఎస్సై సివిల్ డ్రెస్‌లో గ్రామానికి వచ్చి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. హత్యకు అనుకూల వాతావరణం ఉందా.. లేదా అని రెక్కీ నిర్వహించి వెళ్లారు. ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చాకే ఈ హత్య జరిగినట్లు తెలుస్తోంది. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి చెందిన పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై ఈ రెక్కీ నిర్వహించారని తెలుస్తోంది.

నిందితులు సాక్షులుగా, సాక్షులు నిందితులుగా..

తోట చంద్రయ్య హత్య జరిగిన ఆర్నెల్లకే అంటే 2022 జూన్ 3న దుర్గి మండలం జంగమహేశ్వరపాడుకు చెందిన టీడీపీ నేత జల్లయ్యను వైసీపీ గుండాలు దారుణంగా హతమార్చారు. అంతకు ముందే.. జల్లయ్య గ్రామాన్ని వదిలి గురజాల పరిధిలోని మాడుగులలో తలదాచుకుంటున్నాడు. జల్లయ్యను హతమారిస్తే గ్రామంలో తమ ఆధిపత్యానికి ఎదురుండదని వైసీపీ నాయకులు భావించారు. అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడైన జంగమహేశ్వరపాడుకు చెందిన రౌడీషీటర్ మన్నెయ్య, ఆయన సోదరులు జల్లయ్యను హతమా ర్చేందుకు సిద్ధమయ్యారు. జల్లయ్య రావులాపురం గ్రామంలో తన అన్న కుమార్తె వేడుకకు వస్తుండగా.. మన్నెయ్య నేతృత్వంలో జంగమహేశ్వ రపాడు శివారు కాకిరాల అటవీ ప్రాంతంలో దారి కాచి కత్తులతో పొడిచి దారుణంగా జల్లయ్యను హత మార్చారు. ఈ హత్యకు పాల్పడిన మన్నెయ్య, మరి కొందరిపై హత్య కేసు బనాయించకపోగా జల్లయ్యతో పాటు ఉండి ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన జల్లయ్య మేనమామలనే నిందితులుగా చేర్చి.. కేసు నమోదు చేశారు. జల్లయ్యను హత్య చేసిన వారినే ఈ కేసులో సాక్షులుగా పేర్కొనడం నాటి దారుణాలకు పరాకాష్ట. జల్లయ్యను హత్య విషయం పోలీసులకు ముందుగానే తెలుసనేది బహిరంగ రహస్యం.

బాధితులనే నిందితులుగా..

కొందరు టీడీపీ నాయకులు కారంపూడి వద్ద ఓ శుభకార్యానికి వెళ్తే.. రౌడీషీటర్ మన్నెయ్య, అతని అనుచరులు వారిపై హత్యాయత్నం చేశారు. ఆటోతో వారిని ఢీ కొట్టారు. ఈ ఘటనలో ఇద్దరి కాళ్లు విరగ్గా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో టీడీపీ వాళ్లు మన్నెయ్యను చంపడానికి యత్నిస్తే ఆయన దానిని ప్రతిఘటించారని బాధితులపైనే కేసు నమోదు చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల ఏకగ్రీవాల బాధ్యత ఖాకీలదే..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడులో స్థానిక సంస్థల ఎన్నికలు ఏకగ్రీవం చేసే బాధ్యత ఖాకీలు తమ భుజస్కందాలపై వేసుకున్నారు. గ్రామాల్లో టీడీపీ తరపున నామినేషన్‌లు వేయకుండా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అసలు పోలింగే జరగకుండా చేయాలని పిన్నెల్లి బ్రదర్స్ నుంచి వచ్చిన ఆదేశాలను ఆయా పోలీస్ అధికారులు పాటించారు. ఎవరైనా నామినేషన్ వేయడానికి ముందుకు వస్తే రాత్రికిరాత్రే వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి కూర్చోపెట్టి బలవంతంగా మెడలో కండువా మార్చారు. అప్పటికీ మాట వినకుంటే అక్రమ మద్యం కేసులు బనాయించి జైలుకు పంపారు. ఓ ఎస్సై వేధింపులతో వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మత్స్యకారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మాచర్ల నియోజకవర్గంలో ఒకటిరెండు మినహా ఎక్కడ కూడా స్థానిక సంస్థల ఎన్నికలు జరగలేదు. రెంటచింతల పరిధిలోని పాలువాయి, తుమ్మకోటలో మాత్రమే పంచాయతీ ఎన్నికలు జరిగాయి. తుమ్మకోటలో టీడీపీ అభ్యర్థి గెలిస్తే స్థానిక ఎస్సై దగ్గరుండి కౌంటింగ్ సమయంలో కరంట్ తీయించి ఫలితాన్ని తారుమారు చేసి వైసీపీ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటించారు. జడ్పీటీసీకి పోటీ చేసేందుకు నామినేషన్ వేసేందుకు టీడీపీ నేతలు మాచర్ల మండలం జమ్మలమడక నుంచి వెళ్తుండగా.. పోలీసులు రెంటచింతలలో అడ్డుకుని వారిని మాచర్ల రూరల్ పోలీసులకు అప్పగిస్తే మాచర్ల రూరల్ పోలీసులు వారి మీద అక్రమ మద్యం కేసు పెట్టి అరెస్ట్ చేశారు.

మిస్టరీగా పిన్నెల్లి సోదరుడి భార్య, కూతురి మరణాలు

మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బాబాయి సుందరరామిరెడ్డి తనయుడు మధుసూదనరెడ్డి భార్య, కూతురు మరణాలు ఇప్పటికీ మిస్టరీగా మిగిలిపోయాయి. 2022లో మధుసూదనరెడ్డి భార్య లావణ్య (30), కుమార్తె సుదీక్ష (5) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అడిగొప్పుల వద్ద వారు ప్రయాణిస్తున్న కారు కాల్వలోకి దూసుకుపోయిందని, ఈ ప్రమాదంలో తాను తప్పించుకోగా.. భార్య, కూతురు కాల్వలో మునిగి చనిపోయారనేది మధుసూదనరెడ్డి వాదన. పోస్టు మార్టం నివేదికలో వారు ఊపిరాడక చనిపోయారని, వారి ఒంటిమీద ఏడెనిమిది గాయాలు ఉన్నట్లు వెల్లడైంది. కానీ, కేసును ప్రమాదవశాత్తు జరిగిన మరణాలుగా పేర్కొంటూ మూసివేయడం మరిన్ని అనుమానాలకు ఆజ్యం పోసింది.

నివేదిక తొక్కిపెట్టిందెవరు?

ఈ మూడు కేసులపై కూటమి ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే జూల కంటి బ్రహ్మానంద రెడ్డి పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన రాకపోవడంతో చివరకు సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. సీఎం ఆదేశాలతో కేసులను పునఃవిచారణ జరిపించారు. ఈ మూడు కేసుల్లో పిన్నెల్లి సోదరుల ఒత్తిడి మేరకు నాటి పోలీసులు దుర్మార్గంగా వ్యవహరిం చినట్లు విచారణ అధికారి ఎప్పుడో నివేదిక కూడా అందించారు. అయితే ఈ నివేదిక ఇచ్చి నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అంటే ఆయా నివేదికలను ఉద్దేశపూర్వకంగా తొక్కి పట్టిందెవరు? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సమగ్ర విచారణ జరిగితే సగం మంది పోలీసులు ఇంటికే..

గత ఐదేళ్లలో పల్నాడులోని మాచర్లటౌన్, మాచర్ల రూరల్, దుర్గి, రెంటచింతల, కారంపూడి, నాగార్జునసాగర్, వెల్దుర్తి తదితర పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహించిన అనేక మంది ఎస్సైలు, సీఐల అక్రమాలపై విచారణ జరిపితే వారిలో అత్యధిక మంది సర్వీస్ నుంచి డిస్మిస్ అవుతారనే వాదన ఉంది. నాడు ఖద్దరుతో మిలాఖత్ అయిన పలువురు ఖాకీలు ఒకవైపు పిన్నెల్లి బ్రదర్స్ కనుసన్నల్లో పని చేస్తూ.. మరోవైపు కోట్లు దండుకున్నారు. ఆ విధంగా దోచుకున్న నోట్ల కట్టలను ఓ ఎస్సై తాను అద్దెకు ఉంటున్న ఇంటి సీలింగ్‌లో దాచారని, మరో ఎస్సై ఏకంగా అక్కడి టౌన్‌షిప్‌లో పెట్టుబడి పెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి.

సమాజ హితమే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

లక్ష్యమని వివరించారు. ఇందులో తన తల్లిదండ్రులు పద్మజ, భాను కృష్ణమూర్తి ప్రోత్సాహం ఎంతో ఉందని తెలిపారు.

సివిల్స్ సాధించడం కోసం

-ఎన్.ఆకాష్, 108వ ర్యాంకర్



ఐఐటీ బాంబేలో సీఎస్‌సీ పూర్తి చేసిన తర్వాత ఐఏఎస్ కోసం సివిల్స్ సన్న ద్ధం కాను న్నట్లు 108వ ర్యాంకర్ ఎన్.ఆకాష్ వెల్లడిం చారు. ర్యాంకు సాధన కోసం రోజుకు 12గంట లుపైగా చదివినా ఒత్తిడిలేని విధానంలో పరీక్ష లకు సన్నద్ధం అయినట్లు తెలిపారు. తల్లిదం డ్రులు వసంత, వీరపునాయుడు ప్రోత్సాహం తో లక్ష్యం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

సెమీ కండక్టర్ విభాగంలో రాణించాలి

-విక్రంలేవి, 146వ ర్యాంకర్



ఐఐటీలో బీటెక్ పూర్తి చేసిన తర్వాత సెమీ కండక్టర్స్ పై పరిశోధన చేసి నూతన ఆవిష్కరణలు చేయాలనేది లక్ష్యమని 146వ ర్యాంకు సాధించిన ఇ.విక్రం లేవి తెలిపారు. ఐఐటీ బాంబేలో సీఎస్ఈ బ్రాంచ్‌లో బీటెక్ పూర్తి చేస్తానని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ కోసం పరిశోధనలు

జస్వంత్, 151వ ర్యాంకర్



ఐఐటీ బాంబేలో సీఎస్‌సీ పూర్తి చేసి.. పర్యావరణ పరిరక్షణ కోసం పరిశోధనలు చేయడం లక్ష్యమని 151 వ ర్యాంకర్ జస్వంత్ బాలాజీ వెల్లడించారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ట్రస్ట్ ఏర్పాటు చేసి తన వంతు చేయూత అందిస్తానని చెప్పారు.

వైజ్ఞానిక పరిశోధనలే లక్ష్యం

సాయి మనోజ్ఞ, 152వ ర్యాంకర్



ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో గణితం, కంప్యూటర్ విభాగంలో బీటెక్ పూర్తి చేసి పరిశోధనలు చేయడమే లక్ష్యమని 152వ ర్యాంకర్ సాయి మనోజ్ఞ తెలిపారు. బెంగళూ రులో ఉన్న ఐఐఎస్‌లో బీటెక్ చేయాలని ఆసక్తి ఉందన్నారు. బీటెక్ తర్వాత వైజ్ఞానిక అంశాలపై పరిశోధనలు చేయడం లక్ష్యమని వివరించారు.

బీటీ..రాష్ట్రం దాటి..!

(5వ పేజీ తరువాయి)

అరకేజీ రూ.300 నుంచి రూ.600 వరకు విక్రయిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు అధిక మొత్తంలో బీటీ-3 విత్తనాలు ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలకు ఎక్కువ మొత్తంలో వెళ్లిపోయాయి. అదే సమయంలో తెలంగాణకు కూడా ఎక్కువ మొత్తంలో నిల్వలు తరలించారు. అక్కడ కొందరు ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని విక్రయాలు జరిపే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసిన బీటీ-3 విత్తనాల ప్యాకెట్లు అక్కడ అధిక ధరకు విక్రయస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు.

తూతూ మంత్రమే..

వాస్తవానికి ఖరీఫ్ సీజన్ ఆరంభం అవుతున్న నేపథ్యంలో కమిషనర్ ఆదేశాలతో ఆటోనగర్‌లోని కొన్ని ప్రాసెసింగ్ యూనిట్లను అధికారులు తనిఖీ చేశారు. తనిఖీల సమాచారం ముందే తెలియడంతో ఎక్కడా ఏమీ లభ్యం కాలేదని అప్పట్లో అధికారులు ప్రకటించారు. ఒక చోట కొన్ని విత్తనాలు దొరికినా.. కొందరు అధికారులు వాటిని సర్దుబాటు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. నగరంలో 34 పార్సిల్ కార్యాలయాలు ఉన్నప్పటికీ వాటిని తనిఖీ చేసే నాథుడు లేకపోవడం గమనార్హం.

ఒక్క కేసూ లేదు

గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం పరిధిలో ముగ్గురు ఏఓలను ప్రత్యేకంగా నియమించారు. గుంటూరు నగర పరిధిలో నిఘా వేసి నకిలీ, నిషేధిత విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పట్టుకోవడం వీరి పని. గడచిన ఏడాది కాలంలో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం పరిధిలో పనిచేసే ఏఓ లు పెద్దగా దాడులు చేసిన సందర్భాలు లేవు. గతంలో ఏడాదికి తక్కువలో తక్కువ 15 కేసులు నమోదు అయ్యేవి. గడచిన ఏడాదిలో ఒకటీ రెండు కేసులు తప్ప ఎక్కువ నమోదు కాలేదు. అంటే నకిలీలను అరికట్టే విషయంలో వ్యవసాయ శాఖ ఏ మేరకు కఠినంగా వ్యవహారించిందో అర్థం చేసుకోవచ్చు.

అధికారులకు స్నేహితులే వ్యాపారులు..

నగర పరిధిలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తయారు చేసే వారంతా వ్యవసాయ శాఖలోని ఏదో ఒక స్థాయి అధికా రుల స్నేహితులు.. సహ విద్యార్థులే అని తెలు స్తోంది. ఆ అనుబంధం రైతులను నట్టేట ముంచేందుకు బాగానే ఉపయోగపడుతోంది. ప్రస్తు తం ఉన్న అధికారుల మీద ఇటువంటి ఆరోప ణలు ఎక్కువగా ఉన్నా కమిషనరేట్‌లోని గాడ్ ఫాదర్ లు ఆశీస్సులు మెండుగా ఉన్నందువల్ల ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

నగర పోస్టు.. భలే కాస్టు

గుంటూరు నగర పరిధిలోని ఏఓ పోస్టుకు బాగా గిరాకీ ఉంది. నగర పరిధిలోనే లెక్కకు మించి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల తయారీ కంపెనీలు, డిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీలు ఉన్నాయి. ఇక్కడ తనిఖీకి వెళ్లకుండా ఉంటే ఏడాది రూ.కోట్లలో ఆదాయం వస్తుంది. అందుకని ఈ పోస్టుల్లోకి వచ్చేందుకు మొదటి నుంచి భారీ లాబీయింగ్ నడుస్తోంది. రాజకీయ నేతలు, అధికారుల ఆశీస్సులు ఉన్న వారికే ఈ పోస్టుల్లోకి వచ్చే అవకాశం ఉంటుంది. కమిషనరేట్‌లోని కొందరు కీలక అధికారుల సిఫార్సుతో వైసీపీ నేపథ్యం ఉన్న వారిని ప్రస్తుతం ఆ పోస్టుల్లో నియమించడం వివాదాస్పద మయ్యింది.



గుండ్లపల్లి పంచాయతీ కార్యాలయం

గ్రేట్‌గా పంచాయతీలు

- బలోపేతానికి ముందడుగు
- స్పెషల్ గ్రేడు, గ్రేడు - 1, 2, 3గా వర్గీకరణ
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు..
- పూర్తికావొచ్చిన కసరత్తు
- మౌలిక వసతుల కల్పన, సుపరిపాలన, సత్వర పౌర సేవలు

నకరికల్లు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల బలోపేతానికి కూటమి ప్రభుత్వం ముందడుగు వేసింది. పూర్తి స్థాయిలో మౌలిక వసతుల కల్పన, ప్రజలకు చేరువలో సుపరిపాలన, వేగవంతంగా పౌర సేవలను అందించేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ఇందుకు గ్రామ పంచాయతీలను స్పెషల్ గ్రేడ్, గ్రేడు - 1, 2, 3లుగా వర్గీకరణకు ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారు.

పల్నాడులో 12 స్పెషల్ గ్రేడ్ పంచాయతీలు..

పల్నాడు జిల్లాలో 526 పంచాయతీల్లో స్పెషల్ గ్రేడు కిందకు 12 పంచాయతీలు, గ్రేడు - 1లో 108, గ్రేడు - 2 168, గ్రేడు - 3లో 238 పంచాయతీలు వర్గీకరిస్తూ ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. నకరికల్లు, గుండ్లపల్లి గ్రామ పంచాయతీలను నకరికల్లు మండలంలో స్పెషల్ గ్రేడు చేరుస్తూ- ప్రతిపాదనలను సిద్ధం చేసి పరిపాలన ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. గేడు - 1 కింద కుంకలగుంట, చేజర్ల, దేచవరం, చల్లగుండ్ల, కండ్లకుంట గ్రామాలను, గ్రేడు - 2 కింద చాగల్లు, రూపెనగుంట్ల, చీమలమర్రి, నరసింగపాడు, గ్రేడు - 3గా తురకపాలెం, త్రిపురాపురం, అడ్డరోడ్డు, జల్లాపేట తండా, బాలాజీ నగర్ తండా, శివాపురం తండాలను చేరుస్తూ ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

గతంలో ఐదు గ్రేడ్‌లు

కూటమి ప్రభుత్వం నూతన ప్రతిపాదనలకు ముందు వరకు గ్రామ పంచాయతీలు ఐదు గ్రేడ్లుగా ఉండేవి. ప్రభుత్వం నిర్ణయంతో స్పెషల్ గ్రేడు పంచాయతీలతో పాటు గ్రేడు - 1, 2, 3 పంచాయతీలుగా రూపు మారనున్నాయి.

గిరిజన గ్రామాల్లో మార్పులు..

ఇదే గ్రేడుల విషయంలో గిరిజన గ్రామ పంచాయతీల విషయంలో కొంత మినహాయింపు ప్రభుత్వం ఇచ్చింది. 5 వేలకు పైన జనాభా కలిగిన గ్రామ పంచాయతీలను స్పెషల్ గ్రేడుగా పరిగణిస్తారు. మూడు వేల నుంచి ఐదు వేలు లోపు జనాభా ఉన్న పంచాయతీ లేదా మండల ప్రధాన కేంద్రం గ్రేడు - 1 కిందకు వస్తుంది. గ్రేడు - 2లో 1,500పైనా.. మూడు వేలకు లోబడి జనాభా ఉండాలి. 1,500 లోపు జనాభా కలిగిన గ్రామ పంచాయతీలన్నీ గ్రేడు - 3 పరిధిలోకి వస్తాయి. .

మార్గదర్శకాలు ఇలా..

పది వేలకు పైగా జనాభా, రూ.కోటికి పైగా ఆదాయం ఉన్న గ్రామ పంచాయతీని స్పెషల్ గ్రేడు పంచాయతీగా ప్రభుత్వం పరిణగిస్తుంది. ఇక గ్రేడు - 1లో పది వేల లోపు 4 వేలకు పైన జనాభా, రూ.50లక్షల నుంచి రూ.కోటి లోపు ఆదాయం ఉన్న గ్రామ పంచాయతీలు లేదా మండల కేంద్రం గ్రామ పంచాయతీలను కూడా చేర్చారు. గ్రేడు - 2 పరిధి లోకి రెండు వేల పైన జనాభా కలిగిన గ్రామ పంచా యతీలు వస్తాయి. రెండు వేల లోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలు గ్రేడు - 3 కిందకు వస్తాయి.

దాదాపు పూర్తయిన కసరత్తు..

గ్రామ పంచాయతీల గ్రేడ్‌ల కసరత్తు దాదాపుగా పూర్తయింది. ఉన్నతాధికారుల ఆమోద ముద్రే తరువాయి. పంచాయతీలకు సిబ్బంది నియామకంపై కసరత్తు జరుగుతోంది. స్పెషల్ గ్రేడు పంచాయతీలకు గజిటెడ్ అధికారి హోదా కలిగిన అధికారిని నియమించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం పని చేస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఐదు క్యాటగిరిల్లో ఉండగా వారిని మూడు క్యాటగిరిలకు సర్దు బాటు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయితే గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, సుపరిపాలన వేగవంతంగా పౌర సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం భావిస్తుంది. ఆ దిశగా వేగంగా కసరత్తును చేస్తుంది



నకరికల్లు పంచాయతీ కార్యాలయం

పలు గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రత్తిపాడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో మండలపరిధిలోని పలు గ్రామాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రత్తిపాడు ఎలక్ట్రికల్ ఏఈ గౌతమ్ తెలిపారు. కోయవారిపాలెం, కొండేపాడు, తిక్కిరెడ్డిపాలెం, చినకోండ్రుపాడు, రావిపాటి వారిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విజయవాడ క్లబ్ అధ్యక్షుడిగా రామినేని రామ్మోహన్

తాడేపల్లి టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణపరిధిలోని విజయవాడ క్లబ్ పాలకవర్గాన్ని నూతనంగా ఎన్నుకున్నట్లు క్లబ్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. అధ్యక్షునిగా రామినేని రామ్మోహన్, ఉపాధ్యక్షుడిగా రావూరి వెంకట సుబ్బారావు, కార్యదర్శిగా పెరవలి చంద్రశేఖరరావు, సంయుక్త కార్యదర్శిగా దమ్మాలపాటి వెంకటేశ్వరరావు (రాజా), కోశాధికారిగా మహేంద్రకుమార్ జైన్, పాలకవర్గ సభ్యులుగా దేసు యోగేష్‌చంద్ర, నిమ్మగడ్డ సత్యనారాయణ, అవుతు చంద్రశేఖర్‌రెడ్డి, బోడెపూడి తేజ, వీరమాచినేని కార్తీక్‌రామ్‌లు ఎన్నికైనట్టు పేర్కొన్నారు.

ఐఐటీలో మెరిసిన తేజోతన్మయ



ప్రత్తిపాడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఐఐటీలో ప్రత్తిపాడుకు చెందిన తేజోతన్మయ 490 ర్యాంకు సాధించింది. ప్రత్తిపాడుకు చెందిన అక్షయ విద్యాలయం ఛైర్మన్ వెలగా రాఘవయ్య చౌదరి కుమార్తె అయిన తేజో తన్మయ అదే పాఠశాలలో పదోతరగతి వరకు చదివి ఆ తరువాత విజయవాడలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. తొలి నుంచి చదువులో ప్రథమ స్థానంలో ఉన్న తన్మయ ఐఐటీలో 490 ర్యాంకు సాధించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది.

టెన్త్ టాపర్‌కు నగదు ప్రోత్సాహకం

మంగళగిరి సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతిలో టాపర్‌గా నిలిచిన విద్యార్థినికి గివింగ్ బ్యాక్ టూ సొసైటీ అండగా నిలిచింది. మంగళగిరి విజేత పాఠశాల విద్యార్థిని హర్షిత పదో తరగతి ఫలితాల్లో 600 మార్కులకు గాను 593 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. గివింగ్ బ్యాక్ టూ సొసైటీ తరపున హర్షితను అభినందిస్తూ రూ.పది వేల నగదు బహుమతిని ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా చేతుల మీదుగా సోమవారం అందజేశారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా శివరామప్రసాద్

ప్రత్తిపాడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా గింజుపల్లి శివరామప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ మేరకు పార్టీ పరిశీలకురాలు భీమినేని వందనాదేవి అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో అన్ని గ్రామాలకు చెందిన పార్టీ అధ్యక్షులు ఏకగ్రీవంగా శివరామప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కుర్రి సుబ్బారెడ్డి, చెన్నుబోయిన శ్రీనివాసరావు, డక్కుమళ్ళ భాగ్యారావు, వెలివెల్లి సుబ్బారావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దివ్య ప్రతిష్ఠాపన మహోత్సవం

తాడేపల్లి (కొలనుకొండ), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కొలనుకొండ గ్రామంలో శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప సేవా ట్రస్ట్ సభ్యులు, కొలనుకొండ గ్రామ ప్రజల ఆత్మీయ ఆహ్వానం మేరకు శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి వారి దివ్య ప్రతిష్ఠాపన మహోత్సవంలో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో చిల్లపల్లి మాట్లాడుతూ ప్రతిఒక్కరికి ధార్మికత అవసరమన్నారు. సేవాగుణం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పర్వతం మధుసూదనరావు, మునగపాటి వెంకట మారుతీరావు, సామల నాగేశ్వరరావు, లింగా శ్రీకాంత్, తిరుమలశెట్టి మురళీ కృష్ణ, నియోజకవర్గ జనసేన నాయకులు చిట్టెం అవినాష్, ఉమామహేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళ్లం సేవలు చిరస్మరణీయం

తాడేపల్లి(పెనుమాక), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పెనుమాక అభ్యున్నతికి సర్పంచ్‌గా విశేష సేవలు అందించిన కళ్లం పానకాలరెడ్డి చిరస్మరణీయులని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడిగా విశిష్ట సేవలు అందించారని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్‌ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాకలో మాజీ సర్పంచ్ కళ్లం పానకాల రెడ్డి 4వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు తెలుగురైతు గుంటూరు పార్లమెంటు అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత నేతలు పానకాలరెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

బ్యాంక్ సిబ్బందిపై ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యుల ఆగ్రహం

కాకుమాను, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కాకుమాను భారతీయ స్టేట్ బ్యాంక్ సిబ్బంది దురుసు ప్రవర్తనపై ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన సోమవారం జరిగింది. మండలవ్యాప్తంగా పలు ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లో అవకతవకలు జరిగాయినే గ్రూపు సభ్యులు స్థానిక వెలుగు కార్యాలయంకు, అలాగే గ్రూపు సభ్యులు బ్యాంక్‌లో విచారణ కోసం ఫిర్యాదులు చేస్తున్నారు. సోమవారం మండలంలోని ఒక గ్రామానికి చెందిన ఒక గ్రూపు సభ్యులు ఎస్‌బీఐకి వెళ్లి పొదుపు ఖాతా, డ్వాక్రా రుణాల ఖాతాలకు సంబంధించిన స్టేట్ మెంట్ ఇవ్వమనడంతో బ్యాంక్ సిబ్బంది కొంత అసహనం వ్యక్తం చేశారు. సిబ్బందిపై ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు కూడా అదే స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది చేసేదేంలేక ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులకు స్టేట్‌మెంట్ ఇచ్చారు.

స్వచ్ఛగ్రామాల లక్ష్యం నెరవేరేనా..?!

- అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- రహదారుల వెంటే చెత్తకుప్పలు
- రోడ్లపై పారుతున్న మురుగునీరు
- పట్టించుకోని పంచాయతీ సిబ్బంది



మురుగు కాలువల్లో దట్టంగా పెరిగిన జమ్ము



ప్రధాన రహదారి వెంట ఉన్న చెత్తకుప్పలు

పెదనందిపాడు, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగులపాడులో సమస్యలు తిష్టవేశాయి. ప్రధానంగా పారిశుధ్యం, మురుగునీరు పారుదల, తాగునీరు వంటి సమస్యలు గ్రామస్థులను వెంటాడుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ అవస్తవ్యస్తంగా మారడం మరిన్ని సమస్యలకు కారణమవుతుంది. గ్రామంలో చెత్త తరలించాల్సిన సిబ్బంది ఆ దిశగా స్పందించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయి భరించలేని దుర్వాసన వస్తోంది. పెదనందిపాడు నుంచి బాపట్ల వెళ్లే ప్రధాన రహదారి వెంటే చెత్త వేస్తారు. దీనిని పంచాయతీ అధికారులు తొలగించకపోవడంతో రహదారి వెంట వందలాది మంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. పెదనందిపాడు నుంచి నాగులపాడు వచ్చే ప్రధాన రహదారి వెంట సైడు కాలువలు లేకపోవడంతో కొద్దిపాటి వర్షాలకే మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంటాయి. ఏళ్ల తరబడి పూడిక తీయకపోవడంతో కాలువల్లో దట్టంగా జమ్ము పెరిగి అడవులను తలిపిస్తున్నాయి. దీంతో పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాలు కూడా సక్రమంగా వెలగడం లేదని దీని వల్ల రహదారిలో నడిచి వెళ్తున్న చిన్నారులు పాముకాటుకు గురైన సంఘటనలు ఉన్నాయి. మండల అధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రామంలో సమస్యలు తిష్ట వేశాయి. ఇలా అయితే స్వచ్ఛ గ్రామాల ప్రభుత్వ లక్ష్యం నెరవేరేనా అంటూ ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. రానున్నది వర్షాకాలం అని ఇప్పటికైనా కాలువల్లో పూడికతీత, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలపై దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సమయపాలన పాటించని సిబ్బంది

- 10.30 దాటిన తెరుచుకోని సచివాలయం తలుపులు
- ప్రశ్నించిన వారికి ఫీల్డ్‌కు వెళ్లామని సమాధానం



మూసి ఉన్న సచివాలయం-3



సిబ్బంది కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు, అర్జీదారులు

తాడికొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తాడికొండ సచివాలయాల్లోని సిబ్బంది సమయపాలన పాటించటం లేదనే విమర్శలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. 10.30 గంటలకు సచివాలయ తలుపులు తీయాల్సిన సిబ్బంది పత్తాలేకుండా పోతున్నారు. వివిధ పనుల నిమిత్తం వస్తున్న వృద్ధులు, అర్జీదారులు సిబ్బంది కోసం వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. సోమవారం తాడికొండలోని సచివాలయం-3 కార్యాలయ తలుపులు 10.50 గంటలకు తెరుచుకున్నాయి. ఇప్పటివరకు ఎందుకు తలుపులు తీయలేదని ప్రశ్నిస్తే పింఛన్లు ఇవ్వడానికి ఫీల్డ్‌కు వెళ్లామని సమాధానం చెప్తున్నారు. మేమంగా పింఛన్ తీసుకోవడానికి వచ్చామని చెప్పటంతో వారి నుంచి ఎలాంటి సమాధానం లేదు. కొంత మంది సిబ్బంది ఎప్పుడు ఎక్కడ ఉంటున్నారో తెలియని పరిస్థితి. తమ సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండటంలేదని ప్రజలు చెబుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వం నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయించాలి

- ఏపీ రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి కృష్ణయ్య



తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘ నాయకులు

పెదనందిపాడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : రైతుల నుంచి నల్లబర్లీ పొగాకును ప్రభుత్వం చొరవ తీసుకుని కంపెనీల ద్వారా తక్షణమే కొనుగోలు చేయించాలని ఏపీ రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వీ కృష్ణయ్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. రైతు సంఘాల నిరసనల మేరకు ప్రజాప్రతినిధుల ఆదేశానుసారం కంపెనీలు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చాయని, మూడు నెలలు గడుస్తున్నా కేజీ పొగాకు కూడా కొనుగోలు చేయలేదన్నారు. రైతులు, కౌలు రైతులు వేలాది ఎకరాల్లో పొగాకు సాగుచేశారని, రైతులు ఎన్నో కష్టనష్టాలను ఓర్చి పంటను ఇంటికి చేర్చితే పంటకు కనీస మద్దతు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏడాదికి పొగాకు ఉత్పత్తుల ద్వారా ప్రభుత్వానికి 73వేల కోట్ల రూపాయలు పన్నుల రూపేణా ఆదాయం సమకూరుతుందన్నారు. కూలీలకు కూడా నగదు చెల్లించలేని పరిస్థితిలో రైతులు ఉన్నారని, తెచ్చిన అప్పులు తీర్చేదెలా అంటూ ఆందోళన చెందుతున్నారన్నారు. ఎకరాకు లక్షల్లో అప్పులు చేశారని, దీనిపై ప్రభుత్వం స్పందించి కంపెనీలతో కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు చేయని పక్షంలో గుంటూరులోని జీపీఐ కంపెనీ ఎదుట ధర్నా చేపడతామని, ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో రైతులు, నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం తహసీల్దార్ వెంకటస్వామికి వినతి పత్రం అందజేశారు.

వచ్చామా.. వెళ్లామా...

- ప్రజాసమస్యల పరిష్కార వేదికపై మారని అధికారుల తీరు



హాజరైన నాలుగైదు శాఖల అధికారులు

ప్రత్తిపాడు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలకు పరిష్కార మార్గాలు చూపడంతో పాటు కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించే విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంపై మండల అధికారుల తీరు ఏ మాత్రం మారడం లేదు. నాలుగైదు శాఖల అధికారులు మాత్రమే ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు తప్ప మిగిలిన అధికారులు మాత్రం వచ్చామా.. వెళ్లామా అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఇరవై శాఖలకు పైగా అధికారులు హాజరు కావాల్సి ఉంది. కానీ ఇక్కడ మాత్రం అధికారులు వారికి అనువుగా ఈ కార్యక్రమాన్ని కూడా మలిచేసుకుంటున్నారు. ఏదో ఒక సమయంలో వచ్చి, రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లిపోతున్నారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కూడా ఇదే తంతు జరిగింది. తహసీల్దార్‌తో పాటు నాలుగైదు శాఖల అధికారులు మాత్రమే గ్రీవెన్స్‌లో ఉన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

- వ్య.కా.స జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు

ఫిరంగిపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బేతపూడి, గుండాలపాడు గ్రామాల్లో గల దాసుల కాలనీలకు ఇళ్ళ పట్టాలు వెంటనే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం వ్యక్తం చేశారు. నిరసనలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బేతపూడి-గుండాలపాడు గ్రామాలకు శ్మశాన స్థలాలు ఇవ్వాలని ఆయన కోరారు. నరసరావుపేట హైవే నుంచి పొనుగుపాడు గ్రామంలోకి వెళ్లే రోడ్డు దారుణంగా గుంతలు పడి చెరువులను తలపిస్తున్నాయని, రోడ్డు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. తహసీల్దార్ ప్రసాదరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

● తుళ్లూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటిస్థలం మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ, వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం తుళ్లూరులో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం నేతలు తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్య.కా.స జిల్లా కార్యాదర్శి కాబోతు మాట్లాడుతూ పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేసి సొంతింటి కల సాకారం అయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రంకొండ సత్యానందం, మహిళా సమాఖ్య నాయకులు అనురాధ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' వర్తింప జేయాలి

మేడికొండూరు మే జూన్ 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి వారికి అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు బొట్ల రామకృష్ణ చెప్పారు. స్థానిక కౌలు రైతు సంఘం నాయకులతో కలిసి సోమవారం తహసీల్దార్ ఎం హరిబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు కారసాల ఇమామ్ షేక్ షరీఫ్ ఎం సీతారాములు కరీముల్లా టి.బాజీసాగర్ కొలకలూరు జ్యోతి వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గిరాల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం కింద కౌలు రైతులందరికీ రూ.20వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వ రరావు అన్నారు. కౌలు రైతుల సమస్యలపై కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందించారు.

రుచికరంగా భోజనం తయారు చేయాలి

- ఎంపీడీవో శివపార్వతి

ప్రత్తిపాడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన వాతావరణంలో రుచికరంగా భోజనం తయారు చేసి చిన్నారులకు వడ్డించాలని ప్రత్తిపాడు ఎంపీడీవో శివపార్వతి మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. ప్రత్తిపాడు జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ట్రైనింగ్ కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో శివపార్వతి మాట్లాడుతూ విద్యార్థులకు భోజనం వడ్డించే సమయంలో నిర్వహకులు తప్పకుండా యాప్రాన్, హెడ్ కవర్స్ ధరించాలన్నారు. ఈ సందర్భంగా ఏజన్సీ నిర్వహకులు తయారు చేసిన మెనూను రుచి చూసి బాగా వండిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అవసరాలకు సబ్సిడీపై డ్రోన్‌ల పంపిణీ



డ్రోన్‌ల పంపిణీ లో పాల్గొన్న షేక్ జబీన్, శ్రీఅనిత, ఎంపీడీవో, ఏవో


దుగ్గిరాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయరంగంలో డ్రోన్‌ల వినియోగం ప్రాముఖ్యాన్ని సంతరించుకుందని ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. దుగ్గిరాల పరిధిలోని డీపీ అగ్రహారానికి చెందిన కృపా కిసాన్ గ్రూపునకు 80శాతం సబ్సిడీపై డ్రోన్‌ను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం అందించారు. ఎంపీపీ మాట్లాడుతూ వ్యవసాయరంగంలో డ్రోన్‌ల ద్వారా పురుగు మందుల పిచికారీ చేసుకోవచ్చునని, తద్వారా సమయం వృథా కాకుండా ఉంటుందని అన్నారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు, ఎంఏవో పీ శిరీష, వీఏఏ లావణ్య, రైతు అయ్యన్న, ఈవో తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు మంత్రి లోకేశ్ చేయూత



టిఫిన్ బండ్లు, ఫ్లాట్‌ఫారం రిక్షాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన చిరువ్యాపారులకు చేయూతనందించారు. గ్రామానికి చెందిన కొప్పూరి ఆదిలక్ష్మీ, రంగిశెట్టి ఉమాదేవి, కూరపాటి గోపి, బడిగించుల వెంకటరమణ, దేవన వెంకట సుబ్బమ్మలకు టిఫిన్ బండ్లు, బాణాల దాసు, కంకణాల నరసింహారావులకు ఫ్లాట్‌ఫారం రిక్షాలను సోమవారం స్థానిక టీడీపీ నేతల ద్వారా అందజేయించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు రుద్ర కోటేశ్వరరావు, కొల్లి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.



జనసేన ముట్లూరు కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు (గుంటూరు)



మంగళగిరి దేవస్థానం వద్ద మంగళవారం జరుగనున్న ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమానికి సంబంధించి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సిన్హా, ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల, తహసీల్దారు దినేష్ రాఘవేంద్ర, అర్బన్ సీఐ డి.వినోద్‌కుమార్ తదితరులు సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. - మంగళగిరి

పునఃప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాలు



పాఠశాలలకు తరలిస్తున్న పాఠ్య పుస్తకాలు

కాకుమాను, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునఃప్రారంభం రోజునే ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయం అని ఎంఈవో కేఎఫ్ కెన్నడీ అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఉన్న పాఠ్య పుస్తకాల స్టాక్‌ను మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం పుస్తకాలను సీఆర్పీలతో సరఫరా నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసినట్లు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరికీ అవసరమైన పుస్తకాలను పాఠశాలలోనే ముందస్తుగా అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఆర్పీలు సురేంద్ర, చలపతిరావు, జమాయమ్మ, అనీల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులోని తప్పులను సవరించాలి

గుంటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన రేషన్ కార్డులు చేరికలు, తొలగింపులపై దరఖాస్తు పెట్టుకున్నానని ఆన్‌లైన్‌లో చనిపోయినట్లు వస్తుందని ప్రత్తిపాడు మండలం, గొట్టిపాడు గ్రామానికి చెందిన లెక్కల త్రినాథ్ వాపోయారు. నాటి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలను సేకరించే సమయంలో ఈ తప్పు జరిగినట్టు మండల సిబ్బంది చెబుతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు మాత్రమే ఈ సవరణ చేస్తారని చెప్పటంతో గుంటూరులో కలెక్టర్‌కు అర్జీ ఇచ్చినట్టు పేర్కొన్నారు.

● రేషన్‌కార్డులో నుంచి నాకుమార్తె పేరు తొలగించాలని 8 ఏళ్లుగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రతిపాడు మండలం, గొట్టిపాడు గ్రామానికి చెందిన గుంటుపల్లి దేవేంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేసి మాట్లాడారు. నా కుమార్తెకు 8 ఏళ్ల క్రితం వివాహం చేశానని అప్పటినుంచి కార్డులో ఆమె పేరు తొలగించాలని తిరుగుతున్నానని ఫలితం లేకుండా పోయిందని వాపోయారు.

రైల్వే టీటీఈ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

గుంటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో టీటీఈ ఉద్యోగాలు ఇప్పిస్తానని తమ వద్ద 18 లక్షలు తీసుకొని మంగళగిరిలోని ఏపీఎస్పీ పెట్టాలియన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మంద బాలాజీ మోసం చేశాడని మంగళగిరికి చెందిన కొండ రవిచంద్ర, కాకి నాగస్నేహిత్‌లు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 2020 నుంచి 2022 మధ్య మా నుంచి ఓసారి 8 లక్షలు, మరోసారి 10 లక్షలు తీసుకున్నాడన్నారు. అంతేగాక మీకు ఉద్యోగాలు వచ్చాయని నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్‌లు సృష్టించి తమను వివిధ రాష్ట్రాలకు పిలిపించి అక్కడ హోటళ్ళు, లాడ్జిలలో బస చేయించి మరో 10 లక్షల వరకు ఖర్చు చేయించాడన్నారు. తాము మోసపోయామని గ్రహించిన తర్వాత తమ డబ్బు తమకు ఇవ్వమని అడుగుతుంటే అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నాడని అన్నారు. ఉద్యోగాల పేరుతో తమను మోసం చేసిన బాలాజీపై చట్టప్రకారం చర్యలు తీసుకుని డబ్బు తిరిగి ఇప్పించాలని ఫిర్యాదులో తెలిపారు.

లోను డబ్బులు కట్టకుండా మోసం చేశారు

తమకు డ్వాక్రా లోన్ ఇప్పిస్తామని చెప్పి పర్సనల్ లోన్ ఇప్పించడమే కాకుండా తాము ప్రతినెల చెల్లిస్తున్న పొదుపు డబ్బులను బ్యాంకులో జమ చేయకుండా తమను మోసం చేశారని మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన బాధిత మహిళలు లక్ష్మీ, సాయి దుర్గ, ముంతాజ్, మహాలక్ష్మితో పాటు మరికొందరు మహిళలు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మా గ్రామానికి చెందిన నాగపూర్ణలక్ష్మీ అనే మహిళ తమకు విజయవాడలోని కబేలా సెంటర్లో గల కెనరా బ్యాంకు నుంచి డ్వాక్రాలో ఇప్పిస్తానని చెప్పిందన్నారు. అయితే తమకు డ్వాక్రా లోను కాకుండా పర్సనల్ లోన్ ఇప్పించిందన్నారు. గ్రూపు సభ్యులందరూ కలిసి ప్రతినెలా పొదుపు డబ్బులు ఆమెకు చెల్లిస్తున్నామని, గడచిన 5 నెలలుగా మూడు లక్షల చెల్లించగా ప్రస్తుతం బ్యాంకు ఖాతాలో లక్ష రూపాయలు మాత్రమే ఉన్నాయన్నారు. తాము చెల్లించిన పొదుపు డబ్బులను నాగపూర్ణలక్ష్మి తోపాటు ఆర్పీ శిరీష, లీడర్ భవాని అనే ముగ్గురు కలిసి కాజేసారని బాధిత మహిళలు వాపోయారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కుట్టు శిక్షణ దోహదం

- మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు




కుట్టు శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న కేఎస్ లక్ష్మణరావు

పెదనందిపాడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి కుట్టు శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతాయని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్), మాజీ అధ్యక్షుడు నూతి బాపయ్యచౌదరి వారి సహకారంతో ఏర్పాటు చేసి కుట్టుమిషన్ శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ 4వ విడత మహిళలకు కుట్టు శిక్షణను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ ప్రాంతంలో విజ్ఞానకేంద్రం ద్వారా మహిళలకు, యువతకు, నిరుద్యోగులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం కుట్టు శిక్షణకు సహకారమందిస్తున్న నాట్స్ మాజీ అధ్యక్షుడు నూతి బాపయ్యచౌదరి తల్లిదండ్రులు సుబ్బారావు, లక్ష్మీలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, పారిశ్రామికవేత్తలు దాసరి శేషగిరిరావు, ముద్దన రాఘవయ్య, అరవపల్లి కృష్ణ, విజ్ఞాన కేంద్ర కన్వీనర్ దొప్పలపూడి రమేష్‌బాబు, కాపు వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నాటి హామీలను అమలు చేయాలి

సీపీఐ నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు



ధర్నాను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

మంగళగిరి సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నివాసయోగ్యం కాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలను కేటాయించి పేద ప్రజలను దారుణంగా మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తికావొస్తున్న తరుణంలో పేదలకు ఇచ్చిన హామీలను అమలు జరపాలని కోరారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, పట్టణ కార్యదర్శి ప్రభాకర్‌రావు, నేతలు పాల్గొన్నారు.

● తాడేపల్లి (కుంచనపల్లి), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూటికి 70 శాతంగా ఉన్న కౌలు రైతులందరికీ కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా అన్నదాత సుఖీభవ పథకం కింద ఒక్కో కౌలు రైతుకు రూ.20వేలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ డిమాండ్ చేశారు. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామ సచివాలయ ఇన్‌చార్జి మహమ్మద్ అలీకి సోమవారం వినతిపత్రం అందించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

తహసీల్దార్ కార్యాలయానికి 12 అర్జీలు

తెనాలి రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 12 అర్జీలు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ ఎంవీఎస్ ప్రసాద్ తెలిపారు. అందులో వెబ్ ల్యాండ్ 1, సర్వే 1, స్థలాలకి సంబంధించి 3, రీ సర్వే 1, హౌస్‌సైట్ 1, సర్వేమ్యుటేషన్ 1, ఇతర సమస్యలతో 4 వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యాలయానికి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. పలువురు రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్యాలయంలో 12 అర్జీలు

తెనాలి రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 12అర్జీలు అందినట్లు మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి రావు తెలిపారు. అందులో 28వ వార్డులో తాగునీటి కనెక్షన్ కోసం 1, 26వ వార్డులో విద్యుత్ తీగలపైకి చెట్టుకొమ్మలను తొలగించాలని 2, మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీచౌక్ వరకూ సిమెంట్ రోడ్డుపై ఉన్న గుంతలు పూడ్చాలని 3, 29వ వార్డులో మురుగు కాలువలు నిర్మించాలని 4, 25వ వార్డులో సర్వేకోసం 1, ఖాళీ స్థలం పేరు మార్పు కోరుతూ 1 మొత్తం 12 అర్జీలు అందాయని వెల్లడించారు. తెలిపిన ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని లక్ష్మీపతిరావు పేర్కొన్నారు.

కలెక్టర్ కార్యాలయంలో 8...

తెనాలి అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 దరఖాస్తులు అందించారు. రెవెన్యూ 4, పోలీసు 2, మున్సిపల్, ఎంపీడీవో శాఖలకు సంబంధించి ఒక్కో దరఖాస్తు అందాయని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

పొన్నూరులో 7 ....

పొన్నూరు టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 7 ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. సోమవారం నిర్వహించిన పరిష్కార వేదికలో రెవెన్యూకు సంబంధించి 5, సివిల్ సప్లై విభాగానికి రెండు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ తెలిపారు.

4న మోడల్ డీఎస్సీ పరీక్ష

తెనాలి అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4న మోడల్ డీఎస్సీ పరీక్ష జరుగుతుందని పీఆర్‌టీయూ అధ్యక్షుడు జీవీఎస్ రామకృష్ణ తెలిపారు. గుంటూరు శాంతినగర్‌లోని రింగు రోడ్డు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద గ్రాండు మోడల్ టెస్టు జరుగుతుందని తెలిపారు. డీఎస్సీకి సిద్ధం అవుతున్న విద్యార్థులు తమ పేర్లను 9493446710, 9490342905లో నమోదు చేసుకోవాలని కోరారు.

శ్రీచైతన్య విద్యార్థులకు అడ్వాన్స్ పరీక్షల్లో ర్యాంకులు

తెనాలి అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రత్న టాకీసు సెంటర్‌లో నిర్వహిస్తున్న శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ తిరుపతి రావు తెలిపారు. బి.నక్షత్ర 1532వ ర్యాంకు, వై.వంశీ ఆదిత్య 1984వ ర్యాంకు, ఎ.హాసిని 2174వ ర్యాంకు, కె.యశ్వంత్ 2459వ ర్యాంకు, సిహెచ్.యోహిత 4925 ర్యాంకు సాధించారు. ఆలిండియా స్థాయిలో ఎంతో కఠినమైన జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ర్యాంకుల సాధనకు కళాశాల ప్రత్యేక బోధన విధానాన్ని అమలు చేస్తుందన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి: ఎంఈవో

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో నిర్వహించే మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఎంఈవో రాయల సుబ్బారావు అన్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో సోమవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం నిర్వాహకులకు శిక్షణ తరగతులు జరిగాయి. పాఠశాలలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మధ్యాహ్న భోజన మెనూపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఊహారాణి, పొన్నూరు ఎంఈవోలు చలపతిరావు, విజయ్‌భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌కు పలువురి అభినందనలు

తెనాలి అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన కొత్తపల్లి శామ్యూల్ జవహర్‌ను పలువురు ఎస్సీ సంఘాల నాయకులు అభినందించారు. అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఆళ్లమూడి ప్రభాకరరావు విజయవాడలో ఆయనను కలిసి పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. మాదిగ సామాజిక వర్గం నుంచి మొదటి సారిగా కమిషన్ చైర్మన్ నియామకంపై కూటమి ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు చేతిరాతపై శిక్షణ

తెనాలి అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మారీసుపేటలోని ఎన్‌సీఆర్ఎన్ఎం హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు అందమైన చేతిరాతపై శిక్షణ ఇచ్చారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామ్మోహన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు శిక్షణ అందించారు. పాఠశాలల్లో విద్యార్థుల చేతిరాతను మెరుగుపరచడం, తద్వారా వారు మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులకు అందించే శిక్షణ దోహదపడుతుందన్నారు. ప్రతి విద్యార్థి చక్కటి దస్తూరి అలవరుచుకుంటే అన్నివిధాలా మంచిగా రాణిస్తారని చెప్పారు. శిక్షణకు 50మందికి పైగా ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా హాజరయ్యారు. ఆదినారాయణ, శివనాగేశ్వరరావు, యేసుబాబు, విజయలక్ష్మి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. శిక్షణ ఇచ్చిన రామ్మోహన్‌ను ఘనంగా సన్మానించారు.

కాలువలో తూటికాడ తొలగించరూ..!



గుర్రపుడెక్కతో నిండి ఉన్న కాలువ

తెనాలి రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గుర్రపుడెక్క, తూటికాడ, గడ్డిజాతి మొక్కలతో నిండి ఉన్న కాలువను శుభ్రం చేయించాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని అంగలకుదురు జేఎంజే కళాశాల సమీపంలోని కోపల్లె వెళ్లే రోడ్డులోని కాలువ గత కొన్నేళ్లుగా పూడికతీతకు నోచుకోలేదు. దీంతో గడ్డిజాతి మొక్కలతో నిండి ఉంది. సుమారు 7000 ఎకరాల రైతులు ఈ కాలువ ద్వారా ప్రవహించే నీటితో పంటల సాగునీరుగా వినియోగించుకుంటారు. ఖరీఫ్ సీజన్ దగ్గరపడుతుండటంతో అధికారులు సైతం కాలువ మరమ్మతులపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు దుస్థితిలో ఉన్న కాలువను బాగుచేసి సకాలంలో సాగునీరందేలా చూడాలని కోరుతున్నారు.

దళితులకు క్షమాపణలు చెప్పిన తరువాతే.. తెనాలికి రావాలి

● జగన్ పర్యటనపై మాజీ మంత్రి డొక్కా వ్యాఖ్యలు

గుంటూరు(తూర్పు), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నాటి వైసీపీ పాలనలో సర్వం కోల్పోయిన దళిత కుటుంబాలకు జగన్ మోహన్‌రెడ్డి క్షమా పణలు చెప్పిన తర్వాతే తెనాలి పర్యటనకు రావాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం గుంటూ రు కలెక్టరేట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత కుటుంబాల పరామర్శించే నైతిక బాధ్యతను జగన్ ఎప్పుడో కోల్పోయారని విమర్శించారు. నాటి వైసీపీ పాలనలో దళితులపై జరిగిన దాడుల విషయంలో జగన్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. దళిత డ్రైవర్‌ను డోర్ డెలివరిచేసిన అనంతబాబును, శిరోముండ నం చేసిన తోట త్రిమూర్తులను పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదని నిలదీశారు. డాక్టర్ సుధాకర్‌ను చంపిన వారిని కనీసం శిక్షించలేకపోయారన్నారు. ఇప్పుడు దళిత కుటుంబాలకు పరా మర్శించడానికి రావడం దేనికి సంకేతమని అన్నారు. తెనాలిలో పోలీ సుల చర్యను సమర్థించమని... అదే సమయంలో జగన్ రావడా న్ని కూడా సమర్థించమని స్పష్టం చేశారు. గంజాయి, మత్తు పదార్థా లను అమ్మేవారిని పరామర్శిస్తే తమకు అభ్యంతరం లేదని... కాకపోతే దళిత కుటుంబాలను పరామర్శకు వస్తే మాత్రం అంతకుముందు జరిగిన దాడులపై క్షమాపణలు చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. వెన్నుపోటు దినం చేసే హక్కు వైసీపీకి లేదని గతంలో ఆ పార్టీ ఇచ్చిన చాలా హామీలను నెరవేర్చలేదని గుర్తు చేశారు.

సిద్దేష్ శివాజీ మృతికి పోలీసుల వేధింపులు కారణం కాదు

● స్టేషన్‌కు మేమంతా కలిసే వెళ్లి మాట్లాడాం
● వేధించారనడం అబద్ధం
● గోల్డ్ జ్యూయలరీ మాజీ వైస్‌ప్రెసిడెంట్ శ్రీనివాసరావు

తెనాలి రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బంగారం బట్టీ వ్యాపారి సిద్దేష్ శివాజీ మృతికి పోలీసుల వేధింపులే కారణమంటూ దుష్ప్రచారాలు చేయడం పచ్చి అబద్ధమని ఇందులో నిజం ఏమాత్రం లేదని గోల్డ్ జ్యూలరీ అసోసియేషన్ సంఘం మాజీ వైస్ ప్రెసిడెంట్ చదలవాడ శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం పట్టణంలోని గోల్డ్ జ్యూలరీ వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో సిద్దేష్ శివాజి మృతికి పోలీసులు కారణమంటూ వచ్చిన వార్తలను ఖండిస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. బంగారు బట్టి వ్యాపారిగా పనిచేస్తున్న సిద్దేష్ శివాజి వద్దకు ఈ నెల 31న పోలీసులు వచ్చారన్నారు. తమకు బంగారం దొంగిలించిన కేసులో నిందితుని విచారించగా నీకు కొంత బంగారం అమ్మినట్లు చెప్పాడని తెలిపారు. సాయంత్రం స్టేషన్‌కు వచ్చి నిందితుడిని గుర్తించి ఎంత అమ్మాడో తెలపాలన్నారు. దీంతో సిద్దేష్ శివాజీతో కలిసి యూనియన్ సభ్యులుగా తాము కూడా వెంట త్రీటౌన్ స్టేషన్‌కు వెళ్లడం జరిగిందన్నారు. అక్కడ సీఐ నిందితుడిని గుర్తించమనడంతో అతడి దగ్గర కొన్నట్లు సిద్దేష్ శివాజీ పోలీసులకు చెప్పాడన్నారు. దీంతో ఎస్ఐ ఎంత బంగారం అమ్మావని నిందితుడిని అడగగా 100 గ్రాములని చెప్పడంతో సిద్దేష్ శివాజీ కూడా కొన్నట్లు ఒప్పుకున్నాడని చెప్పారు. అంతకు మించి పోలీసులు ఒక్కమాట కూడా మాట్లాడలేదన్నారు. తాము కొనుగోలు చేసిన బంగారాన్ని తిరిగి ఇస్తానని చెప్పడం.. మరుసటి రోజు వస్తామనడం మినహా పోలీసులు హింసించడం, దురుసుగా ప్రవర్తించడం వంటివి ఏమి చేయలేదని వివరించారు. పత్రికల్లో పోలీసులు వేధించారని వచ్చిన వార్త పూర్తి అబద్ధమని వారు స్పష్టం చేశారు. షేక్ సుభాని, రవి విజయనామ్ దేవయాదవ్, బాలాజీ దేవ్‌కర్ పలువురు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జగన్ పర్యటనకు అనుమతి కోరని వైసీపీ

● ఉద్దేశపూర్వకంగా వివాదం సృష్టించాలని వ్యూహం
● రౌడీషీటర్ పరామర్శకు వస్తుండటంపై సర్వత్రా విమర్శలు

గుంటూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తెనాలిలోని ఐతానగర్‌కు చెందిన రౌడీషీటర్ చేబ్రోలు జాన్ విక్టర్‌ను పరామర్శించేందుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మంగళవారం తెనాలి రానున్నట్లు వైసీపీ ప్రకటించింది. అయితే ఆయన పర్యటనకు వైసీపీ నాయకులు ఇంతవరకు అనుమతి కోసం పోలీసులకు దరఖాస్తు చేసుకోలేదు. దరఖాస్తు చేసుకోకుండానే పోలీసులు అనుమతివ్వలేదంటూ ప్రచారం మొదలుపెట్టారు. పోలీసులు అనుమతివ్వకపోవడంతో కోర్టుకు వెళ్తున్నట్లు కూ డా తప్పుడు ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు జగన్ పర్యటనను అడ్డుకునేలా వారికివారే పథకం రూ పొందించినట్లు స్పష్టమవుతోంది. జగన్ పర్యటనకు సంబంధించి పోలీసులు అధికారులకు సోమవారం రాత్రి కూడా ఉన్నతాధికారులనుంచి ఎటువంటి ఆదేశాలులేవు.

రౌడీ షీటర్‌కు పరామర్శపై విమర్శలు..

మాజీ ముఖ్యమంత్రి ఓ రౌడీ షీటర్‌ను పరామర్శించేందుకు వస్తుండడం చర్చనీయాంశమైంది. ఇటీవల తెనాలి ఐతానగర్లో బహిరంగంగా పోలీసులు రౌడీషీటర్లకు లాఠీ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఓ కానిస్టేబుల్‌పై హత్యాయత్నం చేయడమే కాక అంతకుముందు ఆ ప్రాంతంలో సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండడంతో ప్రజల్లో భరోసా కల్పించేందుకు పోలీసులు ఇలా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఐతానగర్‌లో గత ఐదేళ్లుగా రౌడీ షీటర్ల ఆగడాలు శ్రుతిమించాయి. ప్రజాప్రతినిధి అండదండలతో అక్కడ రౌడీ గ్యాంగులు రెచ్చిపోయాయి. నిందితుల్లో వేము నవీన్ అలియాస్ కిల్లర్‌పై 10 కేసులు ఉన్నాయి. 2టౌన్ స్టేషన్ పరిధిలో రౌడీషీట్ ఉంది. చేబ్రోలు జాన్‌విక్టర్‌పై 10 కేసులు ఉండగా 2023లోనే హిస్టరీ షీట్ ఉంది. దోమ రాకేష్‌పై 9 కేసులు ఉండి జైలుకు వెళ్లివచ్చినా రాత్రి సమయాల్లో రోడ్లపై బైకులతో తిరుగుతూ ఎంతో మందిని ఇబ్బంది పెట్టారు.

తెనాలిలో రౌడీషీటర్లు వీరయ్యపై 12 కేసులు, సురేంద్రపై 3 కేసులున్నాయి. ఆయా రౌడీషీటర్ల అనుచరులుగా ఉన్న లడ్డా గ్యాంగ్ ఇప్పుడు సామాన్యులపై దాడులకు తెగబడుతున్నారు. సముద్రాల పవన్ అలియాస్ లడ్డు అనే రౌడీషీటర్‌పై 12 క్రిమినల్ కేసులు ఉన్నాయి. లడ్డాపై ఇటీవల పోలీసులు పీడీ యాక్ట్ పెట్టి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపారు. రౌడీషీటర్‌లు వేము నవీన్ అలియాస్ కిల్లర్, చేబ్రోలు జాన్‌విక్టర్, దోమ రాకేష్‌పై ఆడవారిపై దాడులు, దారిదోపిడీలకు పాల్పడటం, గంజాయి అమ్మకాలు, హత్యాయత్నాలు, దొంగతనాలు వంటి అనేక దారుణ కేసులు ఉన్నాయి. తొలి నుంచి తెనాలిలో రౌడీషీటర్లను వైసీపీ నాయకులు పెంచి పోషిస్తున్నారు. గతంలో ఐతానగర్ కేంద్రంగా రౌడీషీటర్ సురేంద్ర గ్యాంగ్ సాగించిన అరాచకం తెనాలి వాసులను భయాందోళనకు గురిచేసింది. గతంలో ఆయన స్థానిక వైసీపీ నేతకు అత్యంత సన్నిహితునిగా కొనసాగారు. గతంలో రౌడీషీటర్ లడ్డును తెనాలి పట్టణం నుంచి బహిష్కరించేందుకు పోలీసులు ఫైల్‌ను సిద్ధం చేశారు. అప్పటి వైసీపీ నేత ఫైలుకు మోకాలడ్డినట్లు ఆరోపణలు వచ్చాయి.

బాలుడు గాయపరిచాడని ఫిర్యాదు

తెనాలి రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలుడు రాయితో కొట్టి గాయపరిచాడని అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని చినరావూరుకు చెందిన మారోజు లక్ష్మీలావణ్య ఇంట్లో నిద్రపోతున్న సమయంలో గుర్తుతెలియని బాలుడు రావడాన్ని గమనించి ప్రశ్నించడంతో చేతిలో ఉన్న రాయితో గాయపరిచి పారిపోయాడని తెలిపారు. దీనిపై బాధితురాలిచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైటర్ గోపి పేర్కొన్నారు.

ప్రతి కార్డుదారుడికి సరుకులు ఇవ్వాలి: సబ్ కలెక్టర్



కార్డుదారులకు బియ్యం అందజేస్తున్న సబ్ కలెక్టర్ సంజనా సింహ

తెనాలి అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాలలో ప్రతి కార్డుదారునికి సరుకులు ఇవ్వాలని సబ్ కలెక్టర్ సంజనాసింహ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు అందించే బియ్యం, పంచదార, ఇతర సరుకుల పంపిణీ రేషన్ దుకాణాల ద్వారా చేపట్టింది. ఈ నేపథ్యంలో పట్టణంలోని పలు రేషన్ దుకాణాల్లో జరుగుతున్న రేషన్ పంపిణీని సోమవారం ఆమె పరిశీలించారు. పంపిణీలో ఎదురవుతున్న ఇబ్బందులు గమనించి సూచనలు ఇచ్చారు. ఆమె వెంట రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. పరస్పరం ఫిర్యాదు

తెనాలి రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న ఘటనలో పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. సోమవారం పట్టణంలోని లక్ష్మీ డీలక్స్ బ్రిడ్జిపై పట్టణంలోని నందులపేటకు చెందిన సుబ్రహ్మణ్యం, సంగంజాగర్లమూడికి చెందిన సురేష్‌లు ద్విచక్రవాహనాలపై ఎదురెదురుగా ఢీ కొన్నారు. దీంతో వారి మధ్య జరిగిన స్వల్ప వివాదం కాస్త ఘర్షణకు దారితీసింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో గాయాలయ్యాయి. ఇరువురు పోలీసులను ఆశ్రయించి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మురళి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

కొల్లిపర, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం రేపల్లె మండలం గుడ్డికాయలంక నుండి బొమ్మువానిపాలెం ఇసుక కోసం మోహన్ అనే అతను ట్రాక్టర్ తీసుకువచ్చాడు. మోహన్ ట్రాక్టర్‌ను నిర్లక్ష్యంగా నడపడంతో ట్రాక్టర్‌పై కూర్చున్న పులి జగదీష్ (13) కిందపడి పోయాడు. జగదీష్‌కు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ కోటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని కేసునమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అంజుమన్ కమిటీకి రూ.2 లక్షల విరాళం

పొన్నూరు టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో నిర్మితమవుతున్న అంజుమన్ షాపింగ్ కాంప్లెక్స్‌కు సోమవారం జహీరుద్దీన్ అండ్ బ్రదర్స్ తరపున రూ 2 లక్షల విరాళాన్ని అందజేశారు. ప్రముఖ వ్యాపారవేత్తలు బంగారు వర్తక సంఘం నాయకులు జహీరుద్దీన్, అమీర్ సా, జ్ఞాపకార్థం షేక్ మగ్బుల్ ఈ 2లక్షల నగదును అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్‌కు అందించారు. అంజుమన్ కమిటీ నిర్వాహకులు వ్యాపారవేత్త మగ్బుల్ కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

● ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు రుణాలివ్వాలి
● సీపీఐ నాయకుల ధర్నా

పెదకాకాని, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గ్రామాల్లో పేద ప్రజలకు మూడు సెంట్లు ఇళ్ల స్థలం, రూ.5 లక్షల రూపాయల ఇంటి నిర్మాణానికి రుణం ఇవ్వాలని సీపీఐ డిమాండ్ చేసింది. భారత కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర పిలుపుమేరకు సోమవారం పెదకాకాని మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెదకాకాని సీపీఐ కార్యదర్శి పాటిబండ్ల డేవిడ్‌రాజు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా రైతు సంఘం కార్యదర్శి కొల్లి రంగారెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం పట్టణంలో రెండు సెంట్లు, పల్లెలో మూడు సెంట్లు ఇవ్వటంతో పాటు ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించి ఎన్నికల అనంతరం గెలిచి మంత్రి వర్గ సమావేశంలో తీర్మానం చేసి, జీవో విడుదల చేశారన్నారు. ఆ జీవో ప్రకారం పెదకాకాని మండలంలోని గ్రామాల్లో నివసించే నిరుపేదలకు మూడు సెంట్లు స్థలాలు కేటాయించి అరు లైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు, 5 లక్షల రూపాయలు ఇచ్చి, లబ్ధిదారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అగ్రి గోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతి నేని అగస్టీన్, మహిళా సమైక్య గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రెంటాల కుమారి, షేక్ బాషీద్, ఆర్ల దేవిక, నివేసిన స్థలాలు లేని బాధితులు పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి పేద వారికి నివేశన స్థలం మంజూరు చేయాలని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాళ్ల సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీపీఐ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నివేశన స్థలాల సాధన కోసం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జియావుల్‌హక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు షేక్ గౌస్; గేయ రచయిత దేవరకొండ శ్రీనివాస్, షేక్ మహ్మద్; అలీ, కోటేశ్వరమ్మ, శారద , వెంకయ్య, యశోద, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించాలి

● సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పాశం రామారావు

పెదకాకాని, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలంలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ఆయన సోమవారం పెదకాకాని తహసీల్దార్ పి.కృష్ణకాంత్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఏ పంటకు గిట్టుబాటు ధర అందలేదని అదేవిధంగా మార్కెట్లో ధరలు చూస్తే ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. దళారుల చేతిలో రైతులు దగా పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డును ఇచ్చి పంట భూములు మంజూరు చేయాలన్నారు. దేవదాయ భూముల కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలన్నారు. పెదకాకాని-గోళ్లమూడి మధ్య ఉన్న గుంటూరు చానల్ గేట్లు విరిగిపోయి నీరు వృధాగా పోతూ రైతులు పంటలు వేసుకునే పరిస్థితి కనిపించడం లేదన్నారు. వాటి మరమ్మతులకు తక్షణమే చర్యలు చేపట్టాలని తహసీల్దార్ కృష్ణకాంత్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు ఎస్.నీలాంబరం, బి.బాబురావు, కె.సత్యనారాయణ, వి.శివయ్య, కె.రంగారెడ్డి రైతులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వాదులూ తరలిరండి

● దళిత, క్రైస్తవ సంఘ నాయకుడు సుద్దపల్లి నాగరాజు
● నేడు జగన్ పరామర్శపై వ్యతిరేక ఆందోళన

తెనాలి అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ తెనాలి పర్యటకు వ్యతిరేకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, ప్రజాస్వామ్యవాదులు తరలిరావాలని దళిత, క్రైస్తవ సంఘ నాయకులు సుద్దపల్లి నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఐతానగర్‌లో విచ్చలవిడితనంగా వ్యవహరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న రౌడీషీటర్లను పరామర్శించేందుకు తెనాలి వస్తున్న జగన్ తీరుపై నాగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో రౌడీషీటర్లు హత్యచేసిన వ్యక్తి శవం కూడా ఇప్పటికి దొరకలేదని ఈ అంశంపై కూడా మాజీ ముఖ్యమంత్రి జగన్ సమాధానం చెప్పాలని నాగరాజు డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ పర్యటనకు వ్యతిరేకంగా మంగళవారం ఉదయం 8గంటలకు వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల వద్దకు తరలిరావాలని పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో 2022 మార్చి 22న మూల్పూరుకు చెందిన నూతక్కి రవికిరణ్‌ను రౌడీషీటర్లు లడ్డూగ్యాంగ్ బంధించి చిత్రహింసలు పెట్టి హత్య చేశారని, శవం దొరకకుండా మాయం చేశారని చెప్పారు. నాటి వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఆనాటి మంత్రి మేరుగ నాగార్జున, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అండదండలతో కేసు మాఫీచేసే ప్రయత్నం కూడా జరిగిందన్నారు. ఇప్పటి వరకు చార్జిషీట్ కూడా వేయలేదని వారిని అడిగి చార్జిషీట్ వేసేలా మాజీ సీఎం ఆ కుటుంబానికి న్యాయం చేయాలని హితవు పలికారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న రౌడీషీటర్ల కుటుంబాలను పరామర్శించి సమాజానికి ఏం సందేశం ఇవ్వాలని మాజీ సీఎం ఉద్దేశ్యంగా ఉందని ప్రశ్నించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ వీరనారాయణ

జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో వివేక విద్యార్థులకు ర్యాంకులు

తెనాలి అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో వివేక విద్యార్థులు ర్యాంకులు సాధించారు. సోమవారం వెలువడిన పరీక్షా ఫలితాలలో తమ విదార్థులు సాధించిన ర్యాంకులను వివేక జూనియర్ కళాశాలలో డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ వెల్లడించారు. మెయిన్స్‌లో 99.37 పర్సంటైల్ సాధించిన తూనుగుంట్ల పవన్‌కుమార్ ఆలిండియా ర్యాంకు 4759 సాధించినట్లు తెలిపారు. ఎస్సీ క్యాటగిరిలో 3098ర్యాంకు, కంచర్ల మనీష్ 3280 ర్యాంకు సాధించారు. జాతీయ స్థాయిలో కఠినమైన పరీక్షలుగా భావించే అడ్వాన్స్ పరీక్షల్లో తమ విద్యార్థులు సత్తా చూపారని అభినందించారు. ఈడీ రామరాజు, సీఈవో ఉదయ్‌కిరణ్, ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్, వెంకట్రామ్ పాల్గొన్నారు.



భారీ గేట్లు అందజేసిన దాతలు, ఆలయ ఉప కమిషనర్ లీలాకుమార్

పెదకాకాని ఆలయానికి ఇర్లపాడువాసి వితరణ

● దాతలకు ఆలయ ఉప కమిషనర్ లీలాకుమార్ అభినందనలు

పెదకాకాని, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానానికి క్యూ లైన్లుగా వినియోగించేందుకు పల్నాడు జిల్లా, శావల్యాపురం మండలం, ఇర్లపాడు గ్రామానికి చెందిన ఆరుమళ్ళ వెంకటరావు, అనూష కుటుంబ సభ్యులు కలిసి జింకు పైపులతో చేసిన లక్ష రూపాయలు విలువ చేసే 25 బారికేడ్లు అందజేసినట్లు దేవస్థానం ఉప కమిషనర్ లీలాకుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా లీలా కుమార్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరాళాలు సమర్పించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు.

కుమార్తె పింఛన్‌ను పునరుద్ధరించరూ...



తండ్రితో అర్జీ ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన కాసుల సౌజన్య

గుంటూరు (తూర్పు), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నానని కక్షతో నాటి వైసీపీ ప్రభుత్వం నా కుమార్తె పింఛను తొలగించారని పెదకాకాని మండలం, ఉప్పలపాడు గ్రామానికి చెందిన కాసుల వెంకయ్య ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేశారు. కాసుల సౌజన్య పుట్టుకతోనే మానసిక వైకల్యంతో బాధపడుతోందని, 87శాతం వైకల్యం ఉందంటూ సదరన్ సర్టిఫికెట్‌ను వైద్యులు జారీ చేశారని తెలిపారు. దీనిపై అవగాహన లేక సాధారణ పెన్షన్ తీసుకుంటున్నామని వివరించారు. 70 రూపాయల నుంచి తీసుకుంటున్న పెన్షన్‌ను మూడు ఎకరాల పొలం ఉందనే కారణంతో నాటి వైసీపీ ప్రభుత్వం తొలగించారని చెప్పారు.

చేబ్రోలు ఎంపీడీవోగా ఊహారాణి

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా టి.ఊహారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చేబ్రోలు ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఊహారాణి భట్టిప్రోలు నుంచి పదోన్నతిపై చేబ్రోలు వచ్చారు. ఈ సందర్భంగా ఏవో ఉమాదేవి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు ఊహారాణిని అభినందించారు.

విద్యార్థుల పాఠ్య పుస్తకాల పంపిణీ

పొన్నూరు టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి కొల్లి విజయ్‌భాస్కర్ తెలిపారు. సోమవారం నిడుబ్రోలు జిల్లా పరిషత్ స్టాక్ పాయింట్ నుంచి మండలంలోని అన్ని పాఠశాలలకు విద్యార్థులకు సంబంధించిన మెటీరియల్‌ను పంపిణీ చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని విద్యార్థులందరికి అవసరమైన పుస్తకాలను పాఠశాలలోనే ముందస్తుగా అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. పాఠశాలలు పునః ప్రారంభించేనాటికి అన్నిరకాల పాఠ్య పుస్తకాలు, మెటీరియల్‌ను, విద్యార్థులకు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నిడుబ్రోలు జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శివలక్ష్మి, చింతలపూడి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సాయి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు వెంకటేశ్వరరావు మృతి

పొన్నూరు టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నిడుబ్రోలుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నన్నపనేని వెంకటేశ్వరరావు (65) మృతిచెందారు. ఆదివారం రాత్రి వెంకటేశ్వరరావు ఆకస్మికంగా మృతి చెందాడు. వెంకటేశ్వరరావు తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పార్టీ ఆవిర్భావం నుంచి చురుకైన పాత్ర పోషించారు. వెంకటేశ్వరరావు మృతివార్త తెలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ వెంకటేశ్వరావు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. పలువురు టీడీపీ నాయకులు వెంకటేశ్వరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.